

ఇందూరులో అనన్య

మల్లేశం, వకీల్‌సాబ్ సినిమాల్లో నటించి మెప్పించిన అనన్య నాగళ్ల బుధవారం ఇందూరులో సందడి చేశారు.
– న్యూస్‌టుడే, నిజామాబాద్ సాంస్కృతికం

గ్రంథాలయాల అభివృద్ధికి కృషి

నిజామాబాద్ సాంస్కృతికం, న్యూస్‌టుడే: గ్రంథాలయాలు యువత ఉద్యోగావకాశాలకు దోహదం చేస్తాయని, వీటి అభివృద్ధికి నిరంతరం కృషి చేయాలని మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి సూచించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్‌గా అంతిరెడ్డి రాజిరెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రత్యేక పూజలు చేసి రిజిస్టర్‌లో సంతకం చేశారు. అనంతరం గోనెరెడ్డి కల్యాణ మండపంలో రాష్ట్ర గ్రంథాలయ ఛైర్మన్ డాక్టర్ రియాజ్ ఆయనతో ప్రమాణ స్వీకారం చేయించారు. ముఖ్యఅతిథిగా సుదర్శన్‌రెడ్డి హాజరై మాట్లాడారు. రాష్ట్రప్రభుత్వం ఉద్యోగాలు భర్తీ చేస్తోందని, జిల్లాలో అన్ని గ్రంథాలయాల్లో పాఠకులు, అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం అంతిరెడ్డి రాజిరెడ్డిని సత్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ ఛైర్మన్ తాహెర్, నుడా ఛైర్మన్ కేశ వేణు, డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి, ఐడీసీఎంఎస్ ఛైర్మన్ తారాసింగ్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శులు గడుగు గంగాధర్, నగేశ్‌రెడ్డి, మాజీ మంత్రి మండవ, మాజీ ఎమ్మెల్సీ ఆరికెల, సంస్థ కార్యదర్శి బుగ్గారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న అంతిరెడ్డి రాజిరెడ్డి, ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, డాక్టర్ రియాజ్, తాహెర్, మానాల మోహన్‌రెడ్డి, మాజీ మంత్రి మండవ తదితరులు

బహిరంగ విచారణ నేడు

నిజామాబాద్ అర్బన్, న్యూస్‌టుడే: తెలంగాణ విద్యుత్తు నియంత్రణ మండలి ఆధ్వర్యంలో గురువారం ఉదయం 10.30 గంటలకు కలెక్టరేట్‌లో సమావేశ మందిరంలో బహిరంగ విచారణను నిర్వహిస్తున్నారు. టీజీ ఎన్పీడీసీఎల్ ప్రతిపాదించిన 2024-25 ఆర్థిక సంవత్సరానికి సమగ్ర ఆదాయ ఆవశ్యకత, విల్లింగ్ ఛార్జీలు, రిటైల్ సరఫరా ధరలు, క్రాస్ సబ్సిడీ సర్ ఛార్జీలపై బహిరంగంగా విచారణ ఉంటుంది. నియంత్రణ మండలి ఛైర్మన్ శ్రీరంగారావు, సభ్యులు మనోహర్ రాజు, బండారు కృష్ణయ్య హాజరవుతున్నారు. వినియోగదారులు విచారణకు హాజరు కావాలని ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి తెలిపారు.

25 నుంచి మాధవనగర్ రైల్వే గేటు మూసివేత

ఇందూర్ సిటీ, డిచ్‌పల్లి గ్రామీణం న్యూస్‌టుడే : నిజామాబాద్ రైల్వే స్టేషన్, డిచ్‌పల్లి మధ్య ఉన్న లెవల్ క్రాసింగ్ గేట్(మాధవనగర్ గేట్) ఈ నెల 25 నుంచి 27 వరకు మూసి వేయనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే నిజామాబాద్ సీనియర్ సెక్షన్ ఇంజినీర్ నాగభూషణాచారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గేటు వద్ద జరుగుతున్న మరమ్మతులకు ఆటంకం కలగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. అటుగా వచ్చే వాహనాలు కంఠేశ్వర్ బైపాస్ మీదుగా మళ్లించనున్నట్లు పేర్కొన్నారు. పనుల నిర్వహణలో అంతరాయం లేకుండా చూడాలని నాలుగో ఠాణా పోలీసులను కోరారు.

29న జిల్లాకు బీసీ కమిషన్ బృందం రాక

నిజామాబాద్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: త్వరలో చేపట్టే కులాల గణనపై పలు పార్టీలు, ప్రజా సంఘాలు, ప్రజల అభిప్రాయాలు తెలుసుకోవడానికి ఏర్పాటైన తెలంగాణ బీసీ కమిషన్ సభ్యుల బృందం ఈ నెల 29న నిజామాబాద్‌కు రానున్నట్లు పాలనాధికారి రాజీవ్ గాంధీ హన్మంతు తెలిపారు. ఛైర్మన్ నిరంజన్, సభ్యులు రాపోలు జయప్రకాశ్, తిరుమలగిరి సురేందర్, బాలలక్ష్మి ప్రజాభిప్రాయాన్ని సేకరిస్తారని చెప్పారు. కలెక్టర్ కార్యాలయంలో ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహించే అభిప్రాయ సేకరణకు ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ప్రజలు, సంఘాల బాధ్యులు, ఇతరులు వచ్చి తమ అభిప్రాయాలు తెలపాలన్నారు.

మాక్లూర్ కస్తూర్బాలో నలుగురి బదిలీ

మాక్లూర్, న్యూస్‌టుడే: మాక్లూర్ కస్తూర్బా విద్యాలయం నుంచి ప్రత్యేక అధికారి అనురాధ, ఇద్దరు ఉపాధ్యాయులు, ఓ ఏఎన్ఎంను ఇతర ప్రాంతాలకు బదిలీ చేస్తూ డీఈవో దుర్గాప్రసాద్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రత్యేకాధికారి అనురాధ భీమ్‌గల్‌కు, టీచర్లు సవిత, కవిత సిరికొండ, ఏర్గట్లకు, ఏఎన్ఎం ఈశ్వరి కమ్మర్‌పల్లికి బదిలీ అయ్యారు. వర్గాలుగా విడిపోయి ఒకరినొకరు దూషించుకుంటూ విద్యాలయం ప్రతిష్ఠకు భంగం కలిగిస్తున్నారనే నేపథ్యంలో చర్యలకు ఉపక్రమించారు. తన గొలుసు మాయమైన ఘటనలో ఓ ఉపాధ్యాయురాలు విద్యార్థిని మంత్రగాడి వద్దకు తీసుకెళ్లిన ఘటన నిజం కాదని అధికారులు పేర్కొన్నారు. నిజమే అయినప్పటికీ ఓ నేత అండ ఉండడంతో చర్యలు తీసుకోలేదని పలువురు ఆరోపిస్తున్నారు.

ప్రత్యామ్నాయ మార్గాలు అన్వేషించాలి

నిజామాబాద్ వ్యవసాయం, న్యూస్‌టుడే: సహకార సంఘాలు ధాన్యం కొనుగోళ్ల ద్వారా వచ్చే ఆదాయంపైనే దృష్టి పెట్టకుండా ప్రత్యామ్నాయ వ్యాపార మార్గాలు అన్వేషించాలని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి సూచించారు. వ్యవసాయ అనుబంధ రంగాల్లో అవకాశాలు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదిగేందుకు ప్రణాళికలు తయారు చేసుకోవాలని చెప్పారు. నిజామాబాద్ డీసీసీబీ ప్రధాన కార్యాలయంలో సోమవారం సొసైటీ అధ్యక్షులు, కార్యదర్శులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కేంద్రాల్లో సేకరించిన ధాన్యం నిల్వకు అవసరమైన గోదాములు సిద్ధం చేయాలన్నారు. రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ ఛైర్మన్ మానాల మోహన్‌రెడ్డి, గ్రామీణ ఎమ్మెల్యే భూపతి రెడ్డి, సంస్థ ఎండీ అన్నపూర్ణమ్మ, డీసీసీబీ ఛైర్మన్ రమేశ్‌రెడ్డి, సీనియర్ నాయకులు గడుగు, మార గంగారెడ్డి, ముప్ప గంగారెడ్డి, తారాచంద్ పాల్గొన్నారు.


రైతు ఉప్పొంగంగా

న్యూస్‌టుడే, నిజామాబాద్ వ్యవసాయం

జిల్లాలో ఆశాజనకంగా భూగర్భ జలాలు	భీమ్‌గల్, నవీపేట, డిచ్‌పల్లి, మోపాల్‌లో ప్రమాదకరంగా..	62 ప్రాంతాల్లో 10 మీటర్లలోపే నిల్వలు

జిల్లాలో ఈ ఏడాది సమృద్ధిగా వర్షాలు కురవడంతో భూగర్భ జలాలు ఆశాజనకంగా ఉన్నాయి. వానాకాలం సీజన్ ఆరంభంలో అంతంత మాత్రంగానే ఉన్నప్పటికీ చివరి రెండు నెలల్లో వానలు దంచికొట్టాయి. జిల్లా వార్షిక సగటు వర్షపాతం 854.10 మిల్లీ మీటర్లు ఉండగా ఈ సీజన్‌లో 1092.50 మి.మీ. కురిసింది. 28 శాతం అదనంగా నమోదైంది. ఎగువన నిజాంసాగర్, దిగువన శ్రీరామసాగర్ జలాశయాలు తొణికిసలాడుతున్నాయి. 1200 చెరువులు, చెక్‌డ్యాంలు, కుంటలు నిండుకుండల్లా మారాయి. ఇప్పుడున్న నిల్వలతో జిల్లాలోని 96,321 బోర్లు రెండో పంటకూ నీరిచ్చే పరిస్థితి ఉండటంతో అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

82 పరిశీలన ప్రాంతాల్లో పరిస్థితి	
10 మీటర్ల లోపు	62
10–15 మీటర్లు	15
15–20 మీటర్లు	4
20 మీటర్లపైగా	1



75 శాతం ధోకా లేదు

జిల్లాలో 82 పరిశీలక ప్రాంతాల్లో భూగర్భజల శాఖ ఫిజియో మీటర్ల ద్వారా నీటిమట్టాలు పరిశీలించింది. 75 శాతం ప్రాంతాల్లో పది మీటర్ల లోపే ఉన్నట్లు అధికారులు ధ్రువీకరించారు. 62 ప్రాంతాల్లో అత్యధికంగా ఉండగా, 19 ప్రాంతాల్లో సాధారణం, ఒక భీమ్‌గల్ ప్రాంతంలో 20 మీటర్ల లోతుకు పడిపోవడం గమనార్హం. వాస్తవానికి సెప్టెంబరు-2023లో జిల్లా సగటు నిల్వ 5.91 మీటర్లు ఉండగా ఈ ఏడాది 7.20 మీటర్ల లోతుకు పడిపోయింది. గతేడాదితో పోలిస్తే ఎక్కువ లోతులోనే నీరుంది. వానాకాలం సీజన్ ప్రారంభం మేలో 12.17 మీటర్ల లోతు నుంచి క్రమంగా పెరిగింది. భీమ్‌గల్, నవీపేట, డిచ్‌పల్లి, మోపాల్ మండలాల్లో నీటి లభ్యత అత్యల్పంగా ఉన్నట్లు అధికారులు గుర్తించారు.


పొదుపుగా వాడుకుంటే భవిష్యత్తు

- పి.శ్రీనివాస్‌బాబు, జిల్లా భూగర్భజలశాఖ అధికారి

ఉన్న నీటి వనరులను పొదుపుగా వాడుకుంటే రానున్న రోజుల్లో తాగు, సాగుకు ఏ ఇబ్బంది ఉండదు. వచ్చే వేసవిలో ప్రతి ఇంటికి ఇంకుడు గుంత, ప్రతి పంట పొలం వద్ద ఫాంపాండ్స్ తవ్వుకోవాలి. జిల్లాలో ఇదివరకు లెక్కల ప్రకారం భూగర్భంలో 96.93 హెక్టా మీటర్ల నీటి లభ్యత ఉంటే అందులో 53.209 హె.మీ. వినియోగమై 43.721 హె.మీ. మిగిలి ఉంది. నిల్వలో 55 శాతమే వినియోగిస్తున్నారు. ఇది మంచి పరిణామమే. అయినా భవిష్యత్తు అవసరాలకు మరింత జాగ్రత్తగా వాడుకోవాలి.



వెల్మల్‌లో రైతు తిరుపతి బోరు నుంచి ఉబికి వస్తున్న నీరు



స్వాహాకార సంఘాలు

- మింగిన సొమ్ము కక్కించేందుకు చర్యలు
- 9 నెలల్లో 9 సొసైటీల్లో విచారణ

ఈనాడు, నిజామాబాద్



రైతు ప్రయోజనాలు కాపాడాల్సిన సహకార సంఘాలు అవినీతిలో కూరుకుపోతున్నాయి. లాభాల బాటలో నడవాల్సి ఉండగా నష్టాల ఊబిలోకి వెళ్తున్నాయి. కొన్ని సొసైటీల్లో పాలకవర్గాలు ఇష్టానుసారం వ్యవహరిస్తున్నాయి. ఆర్థిక వ్యవహారాల్లో జవాబుదారీగా ఉండాల్సిన కార్యదర్శులు గాడితప్పుతున్నారు. ఆయా సంఘాల్లో నిధుల దుర్వినియోగం ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తోంది. ఆడిటర్లను మచ్చిక చేసుకొని ఇన్నాళ్లు విషయం బయటపడకుండా జాగ్రత్త పడ్డారు. ఈ వ్యవహార శైలిలో మార్పు రావాలని.. సంఘాల ఏర్పాటు లక్ష్యం నెరవేరాలంటే పారదర్శకత పాటించాలని రైతులు కోరుకుంటున్నారు.

పోతంగల్‌లో చర్యలు షురూ

పోతంగల్ సహకార సంఘంలో జరిగిన అవినీతికి సంబంధించి ఇప్పటికే కార్యదర్శిపై సస్పెన్షన్ వేటు పడింది. ఆర్థిక లావాదేవీలపై లెక్కలు సకాలంలో చూపని కారణంగా వాణిజ్య, ఆదాయపన్నుల శాఖలు దాదాపు రూ.57 లక్షల జరిమానా విధించాయి. ఈ డబ్బు సొసైటీ ఖాతాలోంచి చెల్లించారు. ఈ నష్టానికి పాలకవర్గం నిర్లక్ష్యమే కారణమని విచారణ అధికారి నివేదికలో పేర్కొన్నారు. ఈ క్రమంలో పాలకవర్గాన్ని ఎందుకు రద్దు చేయకూడదంటూ డీసీవో నోటీసులు సైతం ఇచ్చారు. నష్టం వాటిల్లిన డబ్బును రికవరీ చేసేందుకూ చర్యలు చేపట్టారు. పాలకవర్గం, కార్యదర్శికి నోటీసు జారీ చేశారు. ఈ రెండు నోటీసుల గడువు 15 రోజులుంటుంది. సమాధానం అనంతరం తదుపరి చర్యలుంటాయని డీసీవో శ్రీనివాస్‌రావు 'ఈనాడు'తో చెప్పారు.

నిధులు పక్కదారి

జిల్లాలో తొమ్మిది నెలల్లో తొమ్మిది సహకార సంఘాల్లో నిధుల దుర్వినియోగంపై ఫిర్యాదులొచ్చాయి. వీటిపై విచారణ ఆర్డర్లు ఇది వరకే జారీ అయ్యాయి. పోతంగల్ సొసైటీలో నిర్లక్ష్యంపై విచారణ నివేదిక రావటంతో చర్యలు మొదలయ్యాయి. కొన్నిచోట్ల విచారణ పూర్తయి నివేదికలు సిద్ధమవుతుండగా, మరికొన్నిచోట్ల కొనసాగుతోంది. రెండు సంఘాల్లో ఎరువులు-పురుగు మందుల లావాదేవీల నిధులు పక్కదారి పట్టించారు. మరో రెండు చోట్ల దిగుమతి చేసుకున్న ఎరువుల బస్తాలు మాయమయ్యాయి. ఒక సొసైటీలో బోగస్ బంగారు రుణాల బాగోతం బయటపడింది. నిధులను రుణాలుగా వాడుకొని.. తాకట్టు బంగారం జమ చేయలేదు. ఇంకో చోట పెద్దఎత్తున సీఎంఆర్ కోసం తీసుకున్న వడ్ల బస్తాలు పక్కదారి పట్టించారు. ఈ సొసైటీ మిల్లులపై కేసు నమోదైంది.

రూ. 1.82 కోట్ల రికవరీకి నోటీసులు

కొంతకాలం కిందట డీసీవోగా బాధ్యతలు చేపట్టిన శ్రీనివాస్‌రావు సహకార సంఘాల్లో అక్రమాలపై కొరడా ఝులిపిస్తున్నారు. ఆయన వచ్చాక నాలుగు సొసైటీల కార్యదర్శులపై సస్పెన్షన్ వేటు వేయడం గమనార్హం. గత తొమ్మిది నెలల్లో విచారణ ఆర్డర్లు జారీ చేయటమే కాకుండా దుర్వినియోగమైన సొత్తు రికవరీకి చర్యలు చేపట్టారు. మరో తొమ్మిది సంఘాల్లో బాధ్యులకు సర్‌ఛార్జీ నోటీసులు ఇచ్చారు. వీరిలో పాలకవర్గాల సభ్యులు, కార్యదర్శులున్నారు. సర్‌ఛార్జీ నోటీసులు జారీ అయిన మొత్తం రూ.1.82 కోట్లకు రికవరీ నోటీసులు ఇవ్వడం గమనార్హం. సర్‌ఛార్జీ జారీ అయిన సంఘాల్లో క్రమశిక్షణ చర్యలు తీసుకొనే అవకాశం ఉంది.

ఆర్థిక వనరుల వినియోగంలో విఫలం

ఇందల్‌వాయి, న్యూస్‌టుడే: ఆర్థిక వనరులను సద్వినియోగం చేసుకోవడంలో అధికారులు విఫలమయ్యారని జాతీయ షెడ్యూల్డ్ తెగల కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్‌నాయక్ మండిపడ్డారు. మండలంలోని మాక్లూర్ తండా సమీపంలోని ఏకలవ్య ఆదర్శ పాఠశాలను బుధవారం జిల్లా అదనపు కలెక్టర్ అంకిత్‌తో కలిసి పరిశీలించారు. ప్రాంగణంలోని తరగతి గదులు, ల్యాబ్‌లు, మూత్రశాలలు, వంటశాలతో పాటు ఇతర వసతులను తనిఖీ చేశారు. ల్యాబ్‌లు, కంప్యూటర్ గదిలో అంతర్జాల వసతి, మూత్రశాలల నిర్వహణపై అసంతృప్తి వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు విడుదలైనా వినియోగించకుండా విద్యార్థులకు అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు. విద్యార్థులకు వారానికోసారి నృత్యం, క్రీడల్లో తర్ఫీదు ఇవ్వాలని ఆదేశించారు. త్వరలో మరోసారి పాఠశాల సందర్శనకు వస్తానని, అప్పటి వరకు పరిస్థితి మారకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట డీటీడీవో నాగోరావు, రజిత, ఆర్సీవో గంగారాంనాయక్, డీసీవో సోమ్లానాయక్, ప్రిన్సిపల్ రమేశ్‌కుమార్, తహసీల్దార్ వెంకట్రావ్, ఎంపీడీవో లక్ష్మారెడ్డి తదితరులు ఉన్నారు.



వసతులపై ఆరా తీస్తున్న జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్ నాయక్, చిత్రంలో అదనపు కలెక్టర్ అంకిత్

ఇందూరులో ఇంజినీరింగ్ కళాశాల అత్యవసరం | గడువు సమీపిస్తోంది | తండ్రిని చంపిన తనయుడి అరెస్టు — 6 లో...

ఎస్సారెస్పీ నీటి విడుదల

శ్రీరామసాగర్, న్యూస్‌టుడే: ఎస్సారెస్పీ నుంచి మిగులు జలాల విడుదల కొనసాగుతోంది. బుధవారం 39,446 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండటంతో 8 వరద గేట్లు ఎత్తి 24,992 క్యూసెక్కులను గోదావరి నదిలోకి వదిలారు. పూర్తిస్థాయిలో 1091 అడుగుల నీటినిల్వ ఉంది. కాకతీయ కాల్వకు 4000, ఎస్కేప్ గేట్ల ద్వారా 4000, లక్ష్మి కాల్వకు 150, సరస్వతికి 500, వరద కాల్వకు 5000, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కులు వదులుతున్నారు.

కొనుగోళ్లకు మార్గం చూపండి


మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డితో ఉమ్మడి జిల్లా నేతలు

ఈనాడు, నిజామాబాద్

ధాన్యం కోతలు మొదలైనప్పటికీ ప్రక్రియ ప్రారంభంలో సందిగ్ధత కొనసాగుతోంది. కేంద్రాలు తెరుచుకున్నా కాంటాలు వేయటం లేదు. రైతుల నుంచి ఒత్తిడి వస్తుండటంతో ఉమ్మడి జిల్లా నేతలు పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో హైదరాబాద్‌లో బుధవారం సాయంత్రం భేటీ అయ్యారు. ప్రభుత్వ సలహాదార్లు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, షబ్బీర్ అలీ, ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, లక్ష్మీకాంతరావు, ఇరు జిల్లాల డీఎంలు, డీఎస్‌వోలు ఇందులో పాల్గొన్నారు. నిజామాబాద్, కామారెడ్డిలో వరి సాగు విస్తీర్ణం.. దిగుబడి వివరాలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. కోతలు ఊపందుకున్న పరిస్థితి వివరించారు. ఇప్పటికే కేంద్రాలు తెరిచినప్పటికీ.. ఉన్నతస్థాయి నుంచి ఆదేశాలు అందక కాంటాలు వేయలేకున్నామని చెప్పారు. కేంద్రాల వద్ద రైతులు ధాన్యం ఆరబెడుతున్నారని.. త్వరగా కొనుగోళ్లు ప్రారంభించకుంటే వర్షాలు కురిసి తడిచి నష్టపోతారని మంత్రికి వివరించినట్లు సమాచారం.

మిల్లర్ల ప్రస్తావన లేకుండానే..

మిల్లర్లతో ఒప్పందాలు మినహా అన్ని అంశాల్లో సిద్ధమైనట్లు అధికారులు, ఎమ్మెల్యేలు మంత్రికి వివరించారు. మిల్లర్ల విషయంలో ఇంకా నిర్ణయం జరగకపోవటంతో కొనుగోళ్లకు ఆటంకం తలెత్తుతోందని ప్రస్తావించారు. కొనుగోళ్లు ప్రారంభిస్తే.. ధాన్యం ఎక్కడికి తరలించాలనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. మిల్లులకు తరలించే అవకాశం లేకపోవటంతో పౌరసరఫరాల సంస్థ ఈ సారి ప్రత్యామ్నాయంగా మార్కెటింగ్ శాఖకు చెందిన, ప్రైవేటు గోదాములను సిద్ధం చేసుకొని ఉంచింది. ఈ నేపథ్యంలో ప్రస్తుతానికి కొనుగోళ్లు ప్రారంభించాలని నిర్ణయానికి వచ్చారు. ప్రజాప్రతినిధులు కూడా జిల్లా అధికారులకు సూచనలు చేశారు. కొనుగోలు చేసిన ధాన్యం బస్తాలను మిల్లర్లతో ఒప్పందాలు జరిగే వరకు మార్కెటింగ్‌శాఖ గోదాముల్లో భద్రపరచాలని చెప్పారు. ఈ నెల 26న మిల్లర్ల విషయంలో ప్రభుత్వ నిర్ణయం ప్రకటించే వరకు ఈ విధానం అమలు చేయాలని చెప్పారు. జిల్లాలో ఏ మండలంలో ఎంతమేర కోతలయ్యాయి. ఏ కొనుగోలు కేంద్రం పరిధిలో ఎంత ధాన్యం అరబెట్టారనే వివరాలు ఇరుజిల్లాల కలెక్టర్లు సహకారశాఖ అధికారుల నుంచి సేకరించారు. నూర్పిళ్లు ఎక్కువైన చోట కొనుగోళ్లు ప్రారంభించే అవకాశం ఉంది.



సమావేశమైన మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, చిత్రంలో టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్ గౌడ్, ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, తోట లక్ష్మీకాంతరావు, అధికారులు

చిత్తశుద్ధితో పనిచేయాలి : నుడా ఛైర్మన్

నిజామాబాద్ నగరం, న్యూస్‌టుడే: నుడా అభివృద్ధికి అధికారులు, సిబ్బంది చిత్తశుద్ధితో పనిచేయాలని నుడా ఛైర్మన్ కేశ వేణు పేర్కొన్నారు. ఛైర్మన్‌గా బాధ్యతలు తీసుకున్న ఆయన నుడా, నగరపాలక సంస్థ అధికారులతో బుధవారం మొదటిసారి సమీక్ష నిర్వహించి మాట్లాడారు. నుడా పరిధిలోని గ్రామాలు, వచ్చే ఆదాయం, ఇప్పటివరకు చేపట్టిన పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. భవిష్యత్తులో చేపట్టే అభివృద్ధి పనులపై చర్చించారు. సమావేశంలో టౌన్‌ప్లానింగ్ అధికారులు శ్యామ్‌కుమార్, సుదర్శన్‌రెడ్డి, ఏఈ వాజిద్, సిబ్బంది పాల్గొన్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న కేశ వేణు

సెలవుల్లో వెళ్లిన ఉద్యోగికి మూడు నెలలుగా వేతనం

నిజామాబాద్ విద్యావిభాగం, న్యూస్‌టుడే: జిల్లా విద్యాశాఖలో విచిత్ర ఘటన చోటుచేసుకుంది. సెలవులు పెట్టిన ఉద్యోగికి వేతనం చెల్లించి.. తర్వాత గుర్తించి విషయం బయటకు పొక్కకుండా జాగ్రత్తపడిన సిబ్బంది ఆయన నుంచి చలానా రూపంలో కట్టించుకోవాలని నిర్ణయించారు. సదరు ఉద్యోగికి బుధవారం మూడు నెలల వేతనం చెల్లించడం ఇప్పుడు ఆ శాఖలో చర్చనీయాంశమైంది. వివరాల్లోకి వెళ్తే.. డీఈవో కార్యాలయంలో సీనియర్ అసిస్టెంటుగా పనిచేసే శ్రీనివాస్‌ను ఏడాది క్రితం ధర్పల్లికి డిప్యుటేషన్ వేశారు. ఆయన అక్కడే విధులు నిర్వర్తిస్తున్నా.. డీఈవో కార్యాలయం నుంచే వేతనం చెల్లిస్తున్నారు. ఆయన మూడు నెలల క్రితం వ్యక్తిగత సెలవులు పెట్టారు. ఇందుకు సంబంధించిన లేఖ జిల్లా కార్యాలయానికి పంపినా.. సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా ఉన్నతాధికారులకు చేరలేదని తెలిసింది. అధికారులు ప్రతినెలా వేతనాలు చెల్లిస్తూ వచ్చారు. తీరా ఉద్యోగి పని చేస్తున్న చోట ఆరా తీయగా మూడు నెలల క్రితమే సెలవులు పెట్టినట్లు తెలియడంతో కంగుతిని దిద్దుబాటు చర్యలకు ఉపక్రమించారు. డీఈవో దుర్గాప్రసాద్‌ను వివరణ కోరగా.. విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.


కేకు కోసేందుకు సిద్ధమైన హీరో యువచంద్ర కృష్ణ, హీరోయిన్ అనన్య నాగళ్ల

నగరంలో పొట్టేల్ చిత్ర బృందం సందడి

నిజామాబాద్ సాంస్కృతికం, న్యూస్‌టుడే: సాహిత్ మోత్కూరి దర్శకత్వం వహించిన పొట్టేల్ చిత్ర బృందం బుధవారం నగరంలో సందడి చేసింది. దేవీ థియేటర్‌లో నిర్వహించిన సమావేశంలో కథా నాయకుడు యువచంద్ర, హీరోయిన్ అనన్య నాగళ్ల కేకు కోసి శుభాకాంక్షలు తెలియజేశారు. శుక్రవారం విడుదలవుతున్న తమ చిత్రాన్ని ఇందూరు ప్రజలు ఆదరించాలని కోరారు. థియేటర్ యాజమాన్యం నాగభూషణంగుప్తా, వెంకటేశ్, ఎస్వీసీ మేనేజర్ నాగేశ్వర రావు, ప్రవీణ్, సంతోష్, అశోక్, మధు పాల్గొన్నారు.

28న నిధి ఆప్కే నికత్

ఖలీల్‌వాడి, న్యూస్‌టుడే: నిధి ఆప్కే నికత్ ఈ నెల 28న నిర్వహించనున్నట్లు ప్రాంతీయ పీఎఫ్ కమిషనర్ గణేశ్ కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మానిక్‌బండార్ పరిధిలోని కాకతీయ మహిళా ఇంజినీరింగ్ కళాశాల, కామారెడ్డి జిల్లా కేంద్రం ఆర్కే డిగ్రీ, పీజీ కళాశాలలో కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. పీఎఫ్ చందాదారులు, యజమానులు, పింఛనర్లు తగిన ఆధారాలతో హాజరై సమస్యలు అక్కడికక్కడే పరిష్కరించుకోవచ్చని సూచించారు.

తైక్వాండో పోటీలకు జిల్లా క్రీడాకారులు

నిజామాబాద్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో జిల్లా క్రీడాకారులు ప్రాతినిధ్యం వహించనున్నారని ఎస్జీఎఫ్ కార్యదర్శి నాగమణి తెలిపారు. ఉమ్మడి జిల్లా క్రీడాకారులు బుధవారం జిల్లా కేంద్రం నుంచి బయలుదేరారు. మూడు రోజుల పాటు గజ్వేల్‌లో జరిగే రాష్ట్ర స్థాయి అండర్-17 బాలబాలికల విభాగాల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. శిక్షకుడు, మేనేజర్‌గా ఈశ్వర్ వ్యవహరించనున్నారు.


పోటీలకు వెళ్తున్న క్రీడాకారులతో అధికారులు

ఇందూరులో ఇంజినీరింగ్ కళాశాల అత్యవసరం

☛ ఈనాడు-ఈటీవీ
రౌండ్‌టేబుల్ సమావేశంలో తల్లిదండ్రులు

న్యూస్‌టుడే, నిజామాబాద్ విద్యావిభాగం, సుభాష్‌నగర్

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌తో పాటు ప్రత్యేక రాష్ట్రంలోనూ పదేళ్లుగా ఉమ్మడి జిల్లా నిరాదరణకు గురైంది. మనకంటే చిన్న జిల్లాల్లో ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాలలు నెలకొల్పి జిల్లాను నిర్లక్ష్యం చేశారు. రాజకీయంగా రాష్ట్రస్థాయిలో ఉన్నత పదవులు చేపట్టినా.. సాంకేతిక ఉన్నత విద్యలో ముందుచూపు లేక మన విద్యార్థులకు తీరని నష్టం చేశారు. ఎట్టకేలకు ప్రభుత్వం స్పందించి రాష్ట్రవ్యాప్తంగా పది పాలిటెక్నిక్ కళాశాలలను ఉన్నతీకరించేందుకు నిర్ణయించినా ఈ విద్యాసంవత్సరం అమలుకు నోచుకోలేదు. స్థానిక విద్యార్థుల డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని కళాశాల ఏర్పాటుపై తక్షణమే జీవో విడుదల చేయాల్సిన అవసరముంది. వచ్చే ఏడాది నుంచైనా ప్రవేశాలు కల్పించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. 'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో వారు పాల్గొని తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు. చేశారు. కళాశాల ఏర్పాటుకై ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసి సాధన దిశగా అడుగులు వేద్దామని నిర్ణయించారు.

ఈనాడు తోడు

తెవివిలోనే నెలకొల్పాలి : భూమన్న, నిజామాబాద్

జిల్లాలో పీజీ కళాశాల ఏర్పాటు కోసం పోరాటం చేయాల్సి వచ్చింది. పేద విద్యార్థులకు సాంకేతిక ఉన్నత విద్య దగ్గర చేసేందుకు ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటుకూ పోరాటాలు చేయాల్సి ఉంది. నగరంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఇప్పటికే భవనాలు నిర్మించడంతో ఇరుకుగా మారింది. అందుకే అన్ని వసతులున్న తెలంగాణ విశ్వవిద్యాలయ ప్రాంగణంలోనే ఏర్పాటు చేస్తే బాగుంటుంది.

జిల్లా నేతలు చొరవ చూపాలి : మోహన్‌రావు, నిజామాబాద్

ప్రైవేటు కళాశాలల్లో చదివించడంతో తల్లిదండ్రులం అభద్రతకు గురవుతున్నాం. మా కూతురు హైదరాబాద్‌లో వసతి గృహంలో ఉంటూ ఓ ప్రైవేటు కళాశాలలో చదువుతోంది. బయట ఎలాంటి దుర్ఘటనలు విన్నా భయంగా ఉంటుంది. జిల్లా కేంద్రంలో కళాశాల ఉంటే ఇంటి నుంచే వెళ్లే అవకాశం ఉంటుంది. జిల్లా నేతలు ఉన్నత పదవులు చేపట్టినా ఇంజినీరింగ్ విద్యపై చొరవ చూపలేదు.

కనీసం రెండైనా కావాలి

- మోహన్, విద్యార్థి తండ్రి, నిజామాబాద్

నగరంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఉన్నతీకరణతో పాటు తెలంగాణ వర్సిటీలోనూ ప్రారంభించాలి. అప్పుడే పేద విద్యార్థులకు న్యాయం జరుగుతుంది. విద్యార్థుల తల్లిదండ్రులు అందరూ కలిసి ప్రజాప్రతినిధులపై ఒత్తిడి తీసుకొస్తే సాధ్యమవుతుంది.

ఏర్పాటు ప్రక్రియ వేగవంతం చేయాలి

- వేణుగోపాల్, నిజామాబాద్

ప్రతిపాదనలు పంపుతున్నా మధ్యలోనే ఆగిపోతున్నాయి. గత ప్రభుత్వం జిల్లాకో మెడికల్ కళాశాల ఏర్పాటు చేయడంతో ఎంతో మంది పేద విద్యార్థులకు వైద్యవిద్య చేరువైంది. ప్రస్తుత ప్రభుత్వం పాలిటెక్నిక్ కళాశాలలను అప్‌గ్రేడ్ చేస్తామనడం అభినందనీయం. కానీ, ఏర్పాటు ప్రక్రియ వేగవంతం చేయాలి.

రూ.10 లక్షలకు పైగానే ఖర్చు

- వివేకానంద, మాధవనగర్, నిజామాబాద్

పేద, మధ్యతరగతి తల్లిదండ్రులకు ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాల ఫీజుల కంటే వసతి భారంగా మారింది. నాలుగేళ్ల ఇంజినీరింగ్ విద్య పూర్తి చేయాలంటే రూ.10 లక్షలకు పైగానే ఖర్చవుతోంది. జిల్లాలోనే కళాశాల ఫీజులతో పాటు వసతి ఖర్చులు తప్పుతాయి.


రౌండ్‌టేబుల్ సమావేశంలో విద్యార్థుల తల్లిదండ్రులు

గ్రామీణ విద్యార్థుల ఇక్కట్లు దూరం

- రాజు, నిజామాబాద్

జిల్లాలో కళాశాల లేక ఇతర ప్రాంతాలకు పిల్లలను పంపేందుకు గ్రామీణ ప్రాంత తల్లిదండ్రులు భయపడుతున్నారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేస్తే కళాశాలకు వెళ్లి రావడం సులువై ఇక్కట్లు దూరమవుతాయి. కళాశాల ఫీజులు, వసతిగృహ రుసుములు కలిసొస్తాయి.

కమిటీ ఏర్పాటు చేద్దాం

- శివకుమార్, నిజామాబాద్

ఉమ్మడి నిజామాబాద్‌లో ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాల లేకపోవడంతో లక్షలు వెచ్చించి ఇతర ప్రాంతాలకు భద్రత లేకుండా పిల్లలను పంపిస్తున్నాం. భవిష్యత్తులో మా మాదిరిగా తల్లిదండ్రులు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు కళాశాల నెలకొల్పాలి. ఈ దిశగా జిల్లాస్థాయిలో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలి. ప్రజాప్రతినిధులు, అధికారులను కలిసి వినతిపత్రాలు ఇచ్చేందుకు ఇంటర్మీడియెట్ చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు కలిసిరావాలి.

పేదలు విద్యకు దూరమవుతున్నారు

- గంగాధర్, వినాయక్‌నగర్, నిజామాబాద్

ప్రైవేటులో ఫీజులు చెల్లించలేని ఎంతో మంది పేద విద్యార్థులు ఇంజినీరింగ్ చదువులకు దూరమవుతున్నారు. ప్రభుత్వ కళాశాల వస్తే ఇబ్బందులు తొలగిపోతాయి. తల్లిదండ్రులంతా పోరాడి సాధించుకోవాల్సిన అవసరం ఉంది. సామాజిక మాధ్యమ వేదికగా అందరినీ సమన్వయం చేసుకొని పోరాడుదాం.

ఒకటి కాదు.. మూడు అవసరం

- కృష్ణప్రసాద్, గాయత్రినగర్

ఉమ్మడి నిజామాబాద్ జిల్లా భౌగోళిక పరిస్థితుల ప్రకారం ఒకటి కాదు మూడు ఇంజినీరింగ్ కళాశాలలు ఏర్పాటు చేసినా తక్కువే. ముఖ్యంగా బాలికలు ఇతర ప్రాంతాలకు వెళ్లి చదవడానికి కష్టమవుతోంది. మనకంటే చిన్న జిల్లాల్లో ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాలలు ఏర్పాటు చేశారు. ఇక్కడ ఏర్పాటుచేసేలా నాయకులు, అధికారులు ప్రత్యేక చొరవచూపాలి. రాబోయే విద్యా సంవత్సరంలో అయినా కళాశాలను అందుబాటులోకి తీసుకువచ్చేలా కృషిచేయాలి.

ఆదరణ కరవు

- డాక్టర్ జయప్రసాద్, నిజామాబాద్

జిల్లాలో ఇంజినీరింగ్ విద్యపై అత్యధిక విద్యార్థులు ఆసక్తి చూపుతున్నా మిగితా జిల్లాలతో పోల్చినప్పుడు ఇక్కడ ఆదరణ కరవైంది. కరీంనగర్ శాతవాహన విశ్వవిద్యాలయ పరిధిలో మూడు ఇంజినీరింగ్ కళాశాలలు ఏర్పాటు చేయగా.. అంత కంటే ముందే ఏర్పాటైన తెలంగాణ వర్సిటీ పరిధిలో ఒక్కటీ లేకపోవడం బాధాకరం. వచ్చే విద్యాసంవత్సరంలోగా మంజూరు చేయాలి.

28న ఉమ్మడి జిల్లా మహాసభ

ఖలీల్‌వాడి, న్యూస్‌టుడే: ఎస్సీ వర్గీకరణ అమల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ ఈ నెల 28న మాదిగల ధర్మయుద్ధ ఉమ్మడి జిల్లా మహాసభ కామారెడ్డిలో నిర్వహించనున్నట్లు ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు పోశెట్టి పేర్కొన్నారు. బుధవారం నగరంలోని రోడ్లు, భవనాల శాఖ అతిథి గృహంలో సమావేశం నిర్వహించి మాట్లాడారు. మహాసభకు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ హాజరుకానున్నారని తెలిపారు. కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు. ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రవీణ్, రమేష్, మహేష్, రాములు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలకు ప్రాధాన్యం

జక్రాన్‌పల్లి, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు అధిక ప్రాధాన్యం ఇస్తుందని గ్రామీణ నియోజకవర్గ ఎమ్మెల్యే డా.భూపతిరెడ్డి పేర్కొన్నారు. మునిపల్లిలోని మహాత్మా జ్యోతిబా పులే మహిళా డిగ్రీ కళాశాలలో బుధవారం అండర్-17 జిల్లాస్థాయి మహిళా క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. క్రీడలతో శారీరక వ్యాయామంతో పాటు మానసికోల్లాసం కలుగుతుందన్నారు. నియోజకవర్గంలోని డిచ్‌పల్లి మండలం సుద్దులంలో రూ.125 కోట్లతో ఇంటిగ్రేటెడ్ మోడల్ స్కూల్ మంజూరైందన్నారు. కార్యక్రమంలో కళాశాల రీజినల్ కోఆర్డినేటర్ సత్యనాథ్‌రెడ్డి, ప్రిన్సిపల్ అనూష, నిజామాబాద్ మార్కెట్ కమిటీ ఛైర్మన్ ముప్ప గంగారెడ్డి, డీసీఎంఎస్ మాజీ ఛైర్మన్ ముస్కు సాయారెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు చిన్నారెడ్డి, మాజీ ఎంపీపీ అనంత్‌రెడ్డి, నాయకులు రాజన్న, చిన్న సాయిరెడ్డి, అర్గుల్ నర్సయ్య, నర్సారెడ్డి, గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


వాలీబాల్ ఆడుతున్న రూరల్ ఎమ్మెల్యే డా.భూపతిరెడ్డి



రాష్ట్రంలో త్వరలో పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు నిర్వహించనున్నారు. పూర్వపు ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్, కరీంనగర్ పట్టభద్రుల నియోజకవర్గం పరిధిలోని పట్టభద్రులు, ఉపాధ్యాయులు తమ ఓటు ద్వారా ఎమ్మెల్సీని ఎన్నుకుంటారు. గడువు తేదీ(నవంబరు 6) సమీపిస్తున్నా.. పట్టభద్రులు, ఉపాధ్యాయులు ఓటు హక్కు కోసం దరఖాస్తు చేయడంలో వెనకబడిపోతున్నారు.

తహసీల్దార్, ఆర్డీవో కార్యాలయాల్లో..

ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోవడానికి పట్టభద్రులు, ఉపాధ్యాయులు ముందుగా ఓటరుగా నమోదు చేసుకోవాలి. గతంలో జరిగిన ఎన్నికల సమయంలో నమోదు చేసుకున్న వారు మళ్లీ దరఖాస్తు చేసుకోవాల్సిందే. ఉమ్మడి జిల్లాలోని అన్ని తహసీల్దార్, ఆర్డీవో కార్యాలయాల్లో ఓటరు నమోదు కేంద్రాలు ఏర్పాటు చేశారు. అన్ని కేంద్రాల్లో దరఖాస్తులు అందుబాటులో ఉంచారు. దరఖాస్తుల ప్రక్రియ పర్యవేక్షించడానికి ఓ అధికారిని కూడా నియమించారు.

ఆన్‌లైన్‌లోనూ అవకాశం..

ఆన్‌లైన్‌లోనూ ఓటరుగా దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం కల్పించారు. పూరించిన దరఖాస్తుకు గెజిటెడ్ అధికారి ధ్రువీకరించిన డిగ్రీ సర్టిఫికెట్, ఆధార్, ఓటరు ఐడీ పత్రాలు, ఫోటోను జత చేసి www.ceo telangana. nic.in అనే వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు.

ఇప్పటివరకు దరఖాస్తు చేసుకున్నవారు

జిల్లా	పట్టభద్రులు	ఉపాధ్యాయులు
కామారెడ్డి	2762	207
నిజామాబాద్	7495	469

వీరికే అర్హత

2021 అక్టోబరు 31వ తేదీ నాటికి డిగ్రీ పూర్తి చేసినవారు పట్టభద్రుల నియోజకవర్గ ఓటర్లుగా నమోదు దరఖాస్తు చేసుకోవచ్చు. వీరు ఫాం-18 పూరించి నేరుగా తహసీల్దార్ కార్యాలయంలో అందజేస్తే చాలు. ఇక ఉపాధ్యాయుల్లో 2018 నవంబరు 1వ తేదీ నుంచి 2024 అక్టోబరు 31వ తేదీ వరకు మూడు సంవత్సరాల సర్వీస్ పూర్తి చేసుకున్న ఉపాధ్యాయులు ఫాం-19 పూరించి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటరుగా నమోదుకు దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పనిచేసే స్కూల్ అసిస్టెంట్లు, ఎస్జీటీ ఉపాధ్యాయులు మూడేళ్ల సర్వీసు పూర్తయితే ఓటర్లుగా నమోదు చేసుకోవచ్చు.



క్రీడాకారిణికి అభినందనలు

నిజామాబాద్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: ఆర్యసమాజ్ అనుబంధ రాధాకృష్ణ పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న ఆరాధ్య ఎస్జీఎఫ్ రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికయ్యారని పాఠశాల కార్యదర్శి నారాయణ తెలిపారు. నగరంలోని పాఠశాలలో క్రీడాకారిణిని అభినందించారు. త్వరలో జరిగే పోటీల్లో పాల్గొని జాతీయస్థాయికి ఎంపిక కావాలని ఆకాంక్షించారు.

పాఠశాలల తనిఖీ

జక్రాన్‌పల్లి, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల, కస్తూర్బా గాంధీ విద్యాలయాన్ని డీఈవో దుర్గాప్రసాద్ బుధవారం తనిఖీ చేశారు. విద్యార్థుల పఠనాసక్తిని పరిశీలించారు. మధ్యాహ్న భోజనం తనిఖీ చేశారు. మెనూ ప్రకారం వంట చేయాలని నిర్వాహకులకు సూచించారు. నాణ్యత తగ్గకుండా వండాలని ఆదేశించారు.

బకాయిల విడుదలకు డిమాండ్

నిజామాబాద్ విద్యావిభాగం, న్యూస్‌టుడే: మూడేళ్లుగా ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకార వేతనాల బకాయిలు పేరుకుపోయాయని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి రఘురాం పేర్కొన్నారు. రాష్ట్ర కమిటీ ఆదేశానుసారం బుధవారం నగరంలోని ధర్నాచౌక్ వద్ద విద్యార్థులతో కలిసి ఆందోళన చేపట్టారు. బకాయిలు విడుదల చేయకపోవడంతో చదువు పూర్తయినా పలు కళాశాలలు విద్యార్థులకు ధ్రువపత్రాలు ఇవ్వడం లేదని వాపోయారు. కొన్ని ప్రైవేటు యాజమాన్యాలు దివాలా తీసి ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని పేర్కొన్నారు. తక్షణమే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పందించి సమస్యకు పరిష్కారం చూపాలని, లేనిపక్షంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. జిల్లా అధ్యక్షురాలు అంజలి, నగర సహాయ కార్యదర్శి నవీన్‌కృష్ణ, నాయకులు టోకు, వంశీ, కుషాల్, కార్తిక్, గోదావరి తదితరులున్నారు.




ధర్నాచౌక్‌లో నినాదాలు చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు, విద్యార్థులు

విద్యార్థుల క్షేత్రస్థాయి సందర్శన

నిజామాబాద్ వ్యవసాయం, న్యూస్‌టుడే: ప్రకృతి సిద్ధంగా వ్యవసాయం చేసి పండించిన పంట తింటేనే ఆరోగ్యకరంగా ఉంటామని అభ్యుదయ రైతు చిన్నికృష్ణుడు తెలిపారు. గూపన్‌పల్లి శివారులోని ఆయన వ్యవసాయ క్షేత్రాన్ని బుధవారం రుద్రూర్ వరి పరిశోధన స్థానానికి చెందిన కాలేజ్ ఆఫ్ ఫుడ్ అండ్ సైన్స్ టెక్నాలజీ విద్యార్థులు సందర్శించారు. విభిన్న పురాతన వంగడాలతో చేస్తున్న సేద్యాన్ని ప్రత్యక్షంగా పరిశీలించారు. వరి వంగడాల ప్రాధాన్యం అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.వెంకట్‌రెడ్డి విద్యార్థులకు వివరించారు.


పంట పొలాన్ని పరిశీలిస్తున్న రుద్రూర్ పరిశోధనా స్థానం విద్యార్థులు


జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్ నాయక్‌ను సన్మానిస్తున్న ప్రతినిధులు

వర్సిటీకి రావాలని విన్నపం

తెవివి క్యాంపస్, న్యూస్‌టుడే: జిల్లాకు వచ్చిన జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్ నాయక్‌ను తెవివి ఎస్సీ, ఎస్టీ యూనియన్ ఆధ్వర్యంలో కలిసి సన్మానించారు. తమ సమస్యలు విన్నవించగా త్వరలోనే వర్సిటీకి వస్తానని ఆయన హామీ ఇచ్చినట్లు యూనియన్ ప్రతినిధులు బైకోజి, రవి, నరేశ్ తెలిపారు.

తండ్రిని చంపిన తనయుడి అరెస్టు

నవీపేట, న్యూస్‌టుడే: అనంతగిరిలో తండ్రిని హత్య చేసిన కేసులో అతని కొడుకును బుధవారం అరెస్టు చేసి రిమాండుకు తరలించినట్లు సీఐ సతీశ్‌కుమార్ తెలిపారు. అనంతగిరి వాసి గౌరు అమృతం (54)కు మాక్లూర్ మండలం గొట్టుముక్కులకు చెందిన లక్ష్మితో 30 ఏళ్ల కిందట వివాహమైంది. వీరికి కొడుకులు మహిపాల్, మనోజ్ ఉన్నారు. భర్తతో గొడవల కారణంగా తన ఇద్దరు పిల్లలను తీసుకుని 20 ఏళ్ల కిందట ఆమె పుట్టింటికి వెళ్లి అక్కడే ఉంటున్నారు. అనంతగిరిలో అమృతం పారిశుద్ధ్య కార్మికుడిగా పని చేస్తూ ఒక్కడే నివాసముంటున్నారు. కొనేళ్ల కిందట ఇద్దరు కుమారులు బతుకు దెరువు కోసం దుబాయ్ వెళ్లారు. మనోజ్ పరాయి దేశంలో ఉండగా 15 రోజుల క్రితం మహిపాల్ అనంతగిరికి వచ్చి తండ్రితో పాటే ఉన్నాడు. వివిధ కారణాలు, పాత కక్షలను దృష్టిలో పెట్టుకుని తండ్రిని హత్య చేసేందుకు మహిపాల్ కుట్ర పన్నారు. ఆదివారం అర్ధరాత్రి తర్వాత తండ్రి మెడకు టవల్‌తో ఉరేసి హత్య చేసి సహజ మరణంగా చిత్రీకరించాడు. సోమవారం ఉదయం అంత్యక్రియలకు ఏర్పాట్లు చేస్తుండగా అమృతం మెడకు గాట్లు కనిపించడంతో మృతుని సోదరి, బంధువులు అనుమానం వ్యక్తం చేసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారణలో హత్య జరిగినట్లు తేల్చారు. మహిపాల్‌పై అనుమానంతో అతడిని అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించారని సీఐ చెప్పారు. 20 ఏళ్లుగా తల్లిని దూరం పెట్టడం, తన పెళ్లికి తండ్రి అడ్డురావడం, అనంతగిరిలో ఉన్న రెండిళ్లను విక్రయించి డబ్బులు ఇవ్వాలని ఒత్తిడి చేసినా వినకపోవడం తదితర కారణాలతో తండ్రిపై కక్ష పెంచుకుని హత్య చేసినట్లు విచారణలో వెల్లడించాడని సీఐ వివరించారు. తండ్రిని చంపేందుకే దుబాయి నుంచి వచ్చినట్లు మహిపాల్ అంగీకరించాడు. ఎడపల్లి మండలం జానకంపేట వద్ద నిందితుడిని అరెస్టు చేసి రిమాండుకు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు. కేసును ఛేదించిన నవీపేట ఎస్సై వినయ్, సిబ్బందిని సీఐ అభినందించారు.

నిజామాబాద్

• నిజామాబాద్ అర్బన్ • నిజామాబాద్ రూరల్ • బోధన్ • బాన్సువాడ

బాధిత కుటుంబాలకు పరామర్శ



డిచ్‌పల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: రాంపూర్‌లో విషజ్వరంతో మృతిచెందిన ఓంకార్, పరమేశ్వరిల కుటుంబాలను మాజీ ఎమ్మెల్సీ వీజీ గౌడ్ బుధవారం పరామర్శించారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. రాంపూర్ మాజీ ఎంపీటీసీ సభ్యుడు భూమన్న అనారోగ్యంతో చికిత్స పొందుతుండగా ఆయనను కలిసి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. మాజీ సర్పంచి తిరుపతి, నాయకులు సాయిలు, పద్మారావు తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో సిలబస్ పూర్తిచేయాలి

బోధన్ గ్రామీణం, న్యూస్‌టుడే: నిర్దేశించిన గడువు మేరకు ఇంటర్ సిలబస్ సకాలంలో పూర్తిచేసి విద్యార్థులను అర్ధవార్షిక పరీక్షలకు సన్నద్ధం చేయాలని జిల్లా ఇంటర్ విద్యాధికారి రవికుమార్ సూచించారు. బోధన్‌లోని ప్రభుత్వ మధుమలాల జూనియర్ కళాశాలను బుధవారం ఆయన తనిఖీ చేసి అధ్యాపకులతో మాట్లాడారు. విద్యార్థులు రోజూ కళాశాలకు వచ్చేలా చూడాలన్నారు.



మాట్లాడుతున్న డీఐఈవో రవికుమార్

ఈనాడు సినిమాలు

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏసియన్)
స్క్రీన్-1: విశ్వం 10.20, 1.20, 4.20, 10.35(రాత్రి)
దేవర పార్ట్-I : 7.25
స్క్రీన్-2: జనక అయితే గనక : 1.20, 7.35
మిస్టర్ పర్‌ఫెక్ట్: 4.30 వేట్టయాన్: 10.30(రాత్రి)
స్క్రీన్-3: వేట్టయాన్ : 10.20, 4.30, 7.30, 10.40(రాత్రి) మిస్టర్ పర్‌ఫెక్ట్: 1.30
వేనమ్(తెలుగు)-3డీ : 7.40
వేనమ్(ఇంగ్లిషు)-3డీ : 10.30(రాత్రి)

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణుమాల్)
స్క్రీన్-1: ది వైల్డ్ రోబోట్(హిందీ) 10.10, 4.15
దేవర పార్ట్-I : 12.40, 6.45 వేట్టయాన్ : 10.20(రాత్రి)
స్క్రీన్-2: దేవర పార్ట్-I : 12.20, 3.55
వేనమ్(తెలుగు)-3డీ : 7.30, 10.05(రాత్రి)
స్క్రీన్-3: జనక అయితే గనక : 12.40
లవ్‌రెడ్డి: 3.40 దేవర పార్ట్-I : 6.40, 10.15రాత్రి)
స్క్రీన్-4: విశ్వం : 12.15, 10.40(రాత్రి)
వేట్టయాన్: 3.30 జనక అయితే గనక: 7.00

దేవి (ఎస్వీసీ): మిస్టర్ పర్‌ఫెక్ట్ 11.15, 2.15, 6.15, 9.15రాత్రి)
నటరాజ్(గీతా ఏసియన్): విశ్వం 11.00, 2.20, 6.00, 9.20(రాత్రి)
లలితామహల్(ఎస్వీసీ): దేవర పార్ట్-I 10.45, 2.15, 6.00, 9.30(రాత్రి)
విజయ్(ఎస్వీసీ): వేట్టయాన్ : 11.00, 2.15
వేనమ్(తెలుగు)-3డీ : 6.00, 9.15(రాత్రి)

న్యూస్‌టుడే, నిజామాబాద్ సాంస్కృతికం

ఎంఈవోలకు కార్యాలయాలేవి?

న్యూస్‌టుడే, మోపాల్

ఎంఈవోలు విధులు నిర్వర్తించే కార్యాలయాలు లేక ఇబ్బందులు తప్పని పరిస్థితి. ప్రస్తుతం నగరంలోని శంకర్‌భవన్‌లో మోపాల్(గేమ్ సింగ్), నిజామాబాద్ (గ్రామీణం)(సేవ్యా), నార్త్(వెంకటనారాయణగౌడ్), సౌత్(సాయిరెడ్డి) ఎంఈవోలు ఒకే కార్యాలయంలో ఉంటూ విధులు నిర్వహించాల్సి వస్తుంది. దీంతో ఐదేళ్ల బదిలీపై వచ్చిన ఉపాధ్యాయులు, కొత్తగా డీఎస్సీ ద్వారా విధుల్లో చేరిన వారు, ఇతర అవసరాల కోసం వెళ్లిన వారికి తమ ఎంఈవో ఎవరనేది స్పష్టత ఉండటం లేదు. రికార్డులు, కంప్యూటర్ ఆపరేటర్ ఇతర సామగ్రి తదితర కార్యకలాపాలు నిర్వహించడం పెద్ద సమస్యగా మారింది. మోపాల్ జడ్పీ హెచ్‌ఎస్‌లో ఎంఈవో కార్యాలయ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నప్పటికీ గది దొరకడం లేదు.

తప్పని ఇబ్బందులు

శంకర్ భవన్‌లోని ఎంఈవో కార్యాలయం సౌత్ పరిధిలోకి వస్తుంది. కానీ రెగ్యులర్ ఎంఈవోను తాను ఉంటూ నిజామాబాద్ గ్రామీణ ఎంఈవో ఆ కుర్చీలో కూర్చొంటున్నారు. శంకర్‌భవన్‌లో ఒకే టేబుల్ వద్ద కుర్చీని సేవలు అందించలేక మరో గదిలో నార్త్ ఎంఈవో కూర్చుంటున్నారు. శంకర్ భవన్ పాఠశాలలో గదులను భవిత కేంద్రం, కంప్యూటర్ గదులు, ఇతరత్రా వాటికి ఉపయోగించడంతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు.

కలెక్టర్ దృష్టికి సమస్య

నార్త్, సౌత్ ఎంఈవోలు తమకు ప్రభుత్వ భవనాలు అందుబాటులో లేవని, ఖలీల్‌వాడీలోని పాత డీఈవో కార్యాలయం కేటాయించాలని కోరుతూ విన్నవించినట్లు తెలిసింది. కలెక్టర్ చొరవ తీసుకుంటే ఎంఈవో కార్యాలయాల సమస్య కొలిక్కివచ్చే అవకాశం ఉంది.

☛ డీఈవో దుర్గాప్రసాద్‌ను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా.. స్థానికంగా అందుబాటులో ఉండే భవనాల్లో కార్యకలాపాలు నిర్వహించాలని సంబంధిత ఎంఈవోలకు సూచించినట్లు పేర్కొన్నారు.



ఒకే కార్యాలయంలో ఎంఈవోలు

'కాంగ్రెస్ సర్కారుతోనే ప్రగతి పరుగులు'

నిజామాబాద్ గ్రామీణం, న్యూస్‌టుడే: కాంగ్రెస్ పాలనలోనే రాష్ట్రం అభివృద్ధిలో పరుగులు తీస్తోందని ఎమ్మెల్యే భూపతిరెడ్డి పేర్కొన్నారు. గ్రామీణ మండలం కొత్తపేటలో బుధవారం సొసైటీ గోదాం ప్రారంభం, ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రం భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసి మాట్లాడారు. గత ప్రభుత్వం రైతుల సంక్షేమాన్ని విస్మరించిందని విమర్శించారు. రైతుల అభ్యున్నతికి తమ సర్కారు కృషి చేస్తుందన్నారు. నియోజకవర్గంలో 3500 ఇందిరమ్మ ఇళ్లను పేదలకు అందిస్తామని తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ఛైర్మన్ ముప్ప గంగారెడ్డి, శేఖర్‌గౌడ్, ఎల్లయ్య, సురేష్, హరిచంద్, కుమార్‌రెడ్డి, స్వామి, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి

క్రీడలతో మానసికోల్లాసం

ఎడపల్లి, న్యూస్‌టుడే: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని పోలీసు శిక్షణ కేంద్రం ప్రిన్సిపల్, అదనపు పోలీసు కమిషనర్ కోటేశ్వరరావు అన్నారు. జానకంపేట శివారులోని పోలీసు శిక్షణ కేంద్రంలో స్టయిఫండరీ కేడెట్ ట్రైనీ కానిస్టేబుళ్లకు నిర్వహిస్తున్న స్పోర్ట్స్ మీట్- 2024 కార్యక్రమం బుధవారంతో ముగిసింది. విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. పోలీసు శిక్షణ కేంద్రం వైస్ ప్రిన్సిపల్ మస్తాన్ అలీ, ఏఆర్ ఏసీపీ నాగయ్య, బోధన్ ఏసీపీ శ్రీనివాస్, సీఐ శివారం పాల్గొన్నారు.



విజేత జట్టుకు బహుమతి అందజేస్తున్న అదనపు సీపీ

మేమున్నాం.. మీకు తోడుగా..

94408 85670
80085 74007
98850 93048

సమస్య: వినాయక్‌నగర్‌లోని పాత హౌసింగ్‌బోర్డు కాలనీ యోగా సెంటర్ నుంచి రాకపోకలు సాగిస్తున్న స్కూల్ బస్సు డ్రైవర్లు విపరీతమైన సౌండ్‌తో హారన్ కొడుతున్నారు. చెప్పినా వినిపించుకోవడం లేదు.
- నారాయణ, స్థానికుడు

పరిష్కారం: త్వరలో వినాయక్‌నగర్ ప్రాంతంలో ఆర్టీవోను పంపి బస్సులు తనిఖీ చేసే ఏర్పాట్లు చేస్తాం. **- దుర్గాప్రమీల, డీటీసీ**

సమస్య: వినాయక్‌నగర్ మహాలక్ష్మీనగర్ కాలనీ రోడ్డు నంబరు-1లో చివరగా ఉండే స్తంభానికి వీధి దీపం వెలగడం లేదు.
- లోకేష్, స్థానికుడు

సమాధానం: కొత్త దీపం ఏర్పాటు చేస్తాం **- ఇనాయత్, ఏఈ, జోన్-2, నగర పాలక సంస్థ**



● స్పందన: నెహ్రూనగర్‌లోని పలు వార్డుల్లో మురుగు కాల్వలు శుభ్రం చేయడం లేదని స్థానికులు ఫిర్యాదు చేయగా కార్యదర్శి రాజేందర్ స్పందించి సమస్య పరిష్కరింపజేశారు.



● స్పందన: నాగారం ప్రాంతంలోని ప్రభుత్వ పాఠశాల పక్కన తాగునీటి పైప్‌లైన్ కోసం గుంత తవ్వి ఆరు రోజులు గడిచినా మరమ్మతులు చేయలేదని స్థానికుడు మహేశ్ న్యూస్‌టుడే దృష్టికి తీసుకురాగా. ఏఈ సల్మాన్ స్పందించి మరమ్మతులు పూర్తిచేసి గుంతను పూడ్చి వేశారు.

న్యూస్‌టుడే, ఎడపల్లి, నిజామాబాద్ అర్బన్, నిజామాబాద్ నగరం

కనీస వేతనం చెల్లించాలని డిమాండ్



నిజామాబాద్ నగరం, న్యూస్‌టుడే: మున్సిపల్ ఔట్‌సోర్సింగ్ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని బహుజన మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్(బీఎల్‌టీయూ) రాష్ట్ర అధ్యక్షుడు దండి వెంకట్ డిమాండ్ చేశారు. నగరపాలక సంస్థ ఎదుట బుధవారం ధర్నా నిర్వహించి మాట్లాడారు. మృతిచెందిన కార్మికుడి కుటుంబానికి రూ.50 లక్షలు చెల్లించాలని, బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. యూనియన్ ఉమ్మడి జిల్లా గౌరవ అధ్యక్షురాలు సబ్బని లత, ప్రధాన కార్యదర్శి రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు చేయాలి

నిజామాబాద్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులు పండించిన ధాన్యం త్వరగా సేకరించాలని ఏఐకేఎంఎస్ నాయకులు కోరారు. డీఎస్‌వో అర్వింద్‌రెడ్డిని బుధవారం కలిసి వినతిపత్రం ఇచ్చారు. నెల రోజులుగా కోతలు సాగుతున్నాయని, చాలా చోట్ల ధాన్యం రోడ్లపై ఉంచాల్సి వస్తోందని పేర్కొన్నారు. రైతులు ఇబ్బంది పడుతున్నా ప్రభుత్వం పూర్తిస్థాయిలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడంలో నిర్లక్ష్యం చేస్తోందని నాయకులు పేర్కొన్నారు. పాపయ్య, భూమయ్య, ఎర్రన్న, గంగాధర్, సాయినాథ్ ఉన్నారు.



డీఎస్‌వోకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

సంతకాల సేకరణ



నిజామాబాద్ విద్యావిభాగం, న్యూస్‌టుడే: గిరిరాజ్ ప్రభుత్వ కళాశాల సమయానికి అనుకూలంగా నగరంలోని పలు ప్రాంతాల నుంచి మూడు వేళల్లో ఆర్టీసీ బస్సులు నడపాలని కోరుతూ బుధవారం ఎస్‌ఎఫ్ఐ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. గతేడాది కళాశాల వరకు బస్సు సదుపాయం ఉండేదని, నూతన ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. సంఘ కళాశాల యూనిట్ కార్యదర్శి చక్రి, సభ్యులు దినేష్, సుజిత్ తదితరులు పాల్గొన్నారు.

నిధుల మంజూరుపై హర్షం

సిరికొండ, న్యూస్‌టుడే: మండల కేంద్రానికి 7 కి.మీల దట్టమైన అడవిలో ఉన్న లొంక రామలింగేశ్వరస్వామి ఆలయానికి వెళ్లే మార్గంలో రూ. 3 కోట్లతో హైలెవల్ వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు కావడంతో ఆలయకమిటీ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర ఆర్‌అండ్‌బీ చీఫ్ ఇంజినీర్ మోహన్‌నాయక్‌ను హైదరాబాద్‌లో బుధవారం కలిసి సత్కరించారు. నిధుల మంజూరుకు కృషి చేసినందుకు రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. సంతోష్, గోపీ, గంగాధర్, ప్రకాష్, మారుతి తదితరులు ఉన్నారు.



రాష్ట్ర ఆర్‌అండ్‌బీ చీఫ్ ఇంజినీర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

ప్రమాదకరంగా గుంత



జానకంపేట శివారులోని అలీసాగర్ ఎత్తిపోతల పథకం వద్ద నిజామాబాద్- బోధన్ ప్రధాన రహదారిపై ప్రమాదం పొంచి ఉంది. ఎత్తిపోతల పథకం వంతెనకు ఓ వైపు రక్షణ గోడ లేకపోవడంతో భారీ గుంత ఏర్పడింది. వాహనదారులు ఏ మాత్రం ఆదమరిచినా ప్రమాదం జరిగే ఆస్కారం ఉంది. ప్రమాదం జరగకుండా ఓ చెట్టు కొమ్మను పెట్టారు. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

న్యూస్‌టుడే, ఎడపల్లి

కొనుగోలు కేంద్రాల్లో రైతన్నల తంటాలు

రుద్రూర్, న్యూస్‌టుడే: రుద్రూర్ మండలంలో నూర్పిడులు జోరందుకున్నాయి. కురుస్తున్న వర్షాలు అన్నదాతలను కలవరపెడుతున్నాయి. కొనుగోలు కేంద్రాల్లో రోజుల తరబడి ధాన్యం తూకం వేయకపోవడంతో అన్నదాతలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. రుద్రూర్‌లో రెండు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు ఉండగా ఇటీవల కేంద్రాలు ప్రారంభించారు. కానీ ఇంతవరకు ధాన్యం తూకం వేయ లేదు. కేంద్రాల్లో ధాన్యం పక్షం రోజులుగా ఉంటున్నా కొనుగోలు జరపడం లేదు. దీంతో ధాన్యం మొలకలు వస్తుంది. తడిసిన ధాన్యం ఆరబెట్టేందుకు రూ.500 చొప్పున కూలీలకు వెచ్చిస్తున్నారు.





మాట్లాడుతున్న సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు

ఎరుకల అభివృద్ధికి కృషి చేయాలి

డిచ్‌పల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి పది నెలలు అవుతున్నా.. ఆదివాసీ ఎరుకల తెగల అభివృద్ధికి కృషి చేయడం లేదని భారత ఎరుకల కులవృత్తుల అభివృద్ధి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు ఆరోపించారు. వెంటనే ఏకలవ్య కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. బుధవారం డిచ్‌పల్లి మండలంలో పర్యటించి మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే తమ తెగ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రతి జిల్లా నుంచి పూర్తిస్థాయిలో వివరాలు సేకరించి ప్రభుత్వానికి అందిస్తామన్నారు. ఉపాధికోసం రుణాలు, హెల్త్‌కార్డులు, బీమా, ఇతర సంక్షేమ పథకాలు అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట జిల్లా నాయకులు రాములు, శ్రీను, సుంకయ్య తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి..

సాలూర, న్యూస్‌టుడే: మధ్యాహ్న భోజనం నాణ్యతగా ఉండాలని బోధన్ ఎంపీడీవో బాలగంగాధర్ అన్నారు. బోధన్ మండలంలోని ఊటపల్లి ఉర్దూ మీడియా ప్రాథమిక పాఠశాలను బుధవారం ఆయన సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు.



సాలూరా: భోజనం పరిశీలిస్తున్న ఎంపీడీవో

దరఖాస్తుల ఆహ్వానం

జక్రాన్‌పల్లి, న్యూస్‌టుడే: జక్రాన్‌పల్లి ఆదర్శ పాఠశాల, కళాశాలలో ఈ విద్యాసంవత్సరానికి తాత్కాలిక గంటల ప్రతిపాదికన బోధించుటకు వృక్షశాస్త్రం, రసాయనశాస్త్రం అధ్యాపకులు కావాలని ప్రిన్సిపల్ సుధారాణి ఒక ప్రకటనలో తెలిపారు. పీజీ, బీఎడ్ పూర్తిచేసిన అభ్యర్థులు ఈ నెల 25వ తేదీలోపు కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలన్నారు.



అవార్డు అందజేత

ఖలీల్‌వాడి, న్యూస్‌టుడే: జేసీఐ (జూనియర్ ఛాంబర్ ఇంటర్నేషనల్) అవార్డు ఇందూరును వరించింది. బుధవారం హైదరాబాద్‌లో జేసీఐ బంజారా ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఉత్తమ మాజీ జోన్ ఉపాధ్యక్షుడిగా విజయానంద్ అవార్డు అందుకున్నారు. ఈ అవార్డును జోన్ అధ్యక్షుడు గోవింద్ అందజేశారు. వివిధ రంగాల్లో సేవా కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టినందుకు అవార్డు బహూకరించారు. జోన్ డైరెక్టర్లు శ్రేయ దీక్షిత్, రుబిన మదాని, జోన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

అవగాహన సదస్సు

ఖలీల్‌వాడి, న్యూస్‌టుడే: లయన్స్ క్లబ్ ఆఫ్ నిజామాబాద్ సహారా ఆధ్వర్యంలో సుభాష్‌నగర్‌లోని వెనుకబడిన తరగతుల కళాశాల విద్యార్థినుల వసతి గృహంలో బుధవారం క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వ్యాధి లక్షణాలు, గుర్తించడం, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్యుడు రాజేశ్వర్ అవగాహన కల్పించారు. జిల్లా కార్యదర్శి ఉదయ సూర్యభగవాన్, అధ్యక్షుడు నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై అప్రమత్తత అవసరం

నిజామాబాద్ విద్యావిభాగం, న్యూస్‌టుడే: ప్రస్తుత పరిస్థితుల్లో అందరూ ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రముఖ స్త్రీ వైద్య నిపుణురాలు అంకం భానుప్రియ విద్యార్థినులకు సూచించారు. నగరంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థినులకు లయన్స్ క్లబ్ ఆఫ్ ఇందూర్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ఆరోగ్య అవగాహన సదస్సుకు ఆమె హాజరై మాట్లాడారు. పౌష్టికాహారంతో రక్తహీనత సమస్యను దూరం చేసుకోవచ్చని వివరించారు. క్యాన్సర్ పట్ల అవగాహన పెంచుకోవాలని, మొదటిదశలో గుర్తిస్తే అరికట్టవచ్చన్నారు. ప్రిన్సిపల్ నరేష్, లయన్స్ జోన్ ఛైర్మన్ విజయానంద్, ఉపాధ్యక్షుడు సత్యనారాయణ, కార్యదర్శి రవీంద్రనాథ్, కోశాధికారి రాఘవేంద్రబాబు, అలుమ్ని అధ్యక్షుడు బాల్‌నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వైద్యురాలు భానుప్రియ

డెంగీపై అవగాహన

డిచ్‌పల్లి, న్యూస్‌టుడే: యానంపల్లి గ్రామంలో బుధవారం మండల ఆరోగ్య విస్తర్ణాధికారి శంకర్ డెంగీ వ్యాధిపై అవగాహన కల్పించారు. దోమల ద్వారా మలేరియా, ఫైలేరియా, డెంగీ, చికున్ గన్యా వంటి వ్యాధులు ప్రబలుతాయన్నారు. దోమలు పెరగకుండా పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శి చరణ్‌రాజ్, ఆరోగ్య సిబ్బంది గంగుబాయి, వెంకటరెడ్డి, ఆశా కార్యకర్తలు నిరోష, మంజుల పాల్గొన్నారు.

ప్రయాణికులకు మెరుగైన సేవలు

హనుమకొండ చౌరస్తా, న్యూస్‌టుడే: ప్రయాణికులకు మరింత మెరుగైన సేవలు అందించడంతో పాటు సంస్థ ఆదాయాన్ని పెంచేందుకు కృషి చేయాలని ఆర్టీసీ కరీంనగర్ ఈడీ మునిశేఖర్ అన్నారు. బుధవారం వరంగల్ రీజియన్ కార్యాలయంలో జోన్ పరిధిలోని నిజామాబాద్, కరీంనగర్, ఖమ్మం, ఆదిలాబాద్, వరంగల్ రీజియన్ మేనేజర్లు, డిప్యూటీ రీజనల్ మేనేజర్లు, వివిధ డిపోల మేనేజర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రతి డిపో పరిధిలో నెలా నెలా సమీక్షలు నిర్వహిస్తూ సంస్థ పురోగతిని పరిశీలించుకోవాలన్నారు. అనంతరం కాన్ఫరెన్స్ హాల్, ఆర్టీసీ సిబ్బందికి అందించే నైపుణ్య శిక్షణ కేంద్రాలు ప్రారంభించారు. కార్యక్రమంలో వరంగల్ ఆర్ఎం విజయభాను, డిప్యూటీ ఆర్ఎంలు భానుకిరణ్, మాధవరావు, వివిధ రీజియన్ల మేనేజర్లు పాల్గొన్నారు.

సంతాప సభ

సాలూర: సమాజంలో అందరూ బాగుండాలని కోరుకున్న నాయకుడు చింతం గంగారం అని అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి. ప్రభాకర్ అన్నారు. సాలూర మండలం ఖాజాపూర్‌లో బుధవారం గంగారం సంతాప సభ నిర్వహించారు. అనంతరం ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు.

రేషన్ డీలర్ల ఎంపిక పూర్తి

బోధన్ గ్రామీణం, న్యూస్‌టుడే: బోధన్ డివిజన్ వ్యాప్తంగా ఖాళీగా ఉన్న రేషన్ డీలర్ల నియామక ప్రక్రియ పూర్తయినట్లు సబ్‌కలెక్టర్ వికాస్ మహతో బుధవారం ప్రకటనలో తెలిపారు. 18 ఖాళీల భర్తీకి చేపట్టిన రాత, మౌఖిక పరీక్షలు పూర్తిచేసి డీలర్లను ఎంపిక చేశామని పేర్కొన్నారు.

'హామీలు విస్మరించిన సర్కారు'

బోధన్ గ్రామీణం, న్యూస్‌టుడే: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను విస్మరించిందని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు విమర్శించారు. బోధన్‌లో బుధవారం పార్టీ రెండో ప్రాంతీయ మహాసభకు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. చక్కెర పరిశ్రమను తెరిపించాలని డిమాండ్ చేశారు. గంగాధరప్ప, శంకర్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

బాధ్యతల స్వీకరణ

బోధన్ గ్రామీణం, న్యూస్‌టుడే: బోధన్ పట్టణ ట్రాన్స్‌కో ఏఈగా నాయిని కృష్ణ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఇటీవల కోటగిరి మండలం నుంచి సాధారణ బదిలీల్లో భాగంగా బోధన్‌కు వచ్చారు.

మత్స్యకారుల అభివృద్ధికి కృషి

బోధన్ గ్రామీణం : మత్స్యకారుల జీవనోపాధికి సర్కారు కృషి చేస్తోందని తహసీల్దార్ విఠల్ అన్నారు. పట్టణంలోని పాండు, చెక్కిచెరువులో బుధవారం వ్యవసాయాధికారి సంతోష్‌తో కలిసి చేపపిల్లలను నీటిలో వదిలారు. ఆర్ఐ వరుణ్, మత్స్యకార సంఘ ప్రతినిధులు కోట అబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.



నిందితులను చూపుతున్న ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ వెంకటేశ్, సిబ్బంది

గంజాయి స్వాధీనం

నిజామాబాద్ నేరవిభాగం, న్యూస్‌టుడే: రెంజల్ మండలం నీల పేపర్ మిల్లు వద్ద నివాసముండే బాబర్‌మియా, శంకర్ ద్విచక్రవాహనంపై ఎండు గంజాయి తరలిస్తుండగా బోధన పట్టణ శివారులో సిబ్బందితో కలిసి వీరిని పట్టుకున్నట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ వెంకటేశ్ తెలిపారు. నిందితుల నుంచి 2.050 కిలోల ఎండు గంజాయి, రెండు చరవాణులు స్వాధీనం చేసుకొని బోధన్ ఎక్సైజ్ ఠాణాలో అప్పగించామని పేర్కొన్నారు.

క్రైమ్ కార్నర్

నగరంలో..

నిజామాబాద్ నేరవిభాగం, న్యూస్‌టుడే: నాగారంలో గంజాయి విక్రయిస్తున్నారనే సమాచారంతో నిజామాబాద్ ఎక్సైజ్ పోలీసులు తనిఖీలు నిర్వహించారు. 80 క్వాటర్స్‌కు చెందిన సాజీద్ అలీ ద్విచక్రవాహనంలో 1.110 కిలోల ఎండు గంజాయి దొరికింది. అతడిని అరెస్టు చేసి గంజాయి, ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకొని రిమాండుకు తరలించామని నిజామాబాద్ ఎక్సైజ్ ఎస్‌హెచ్‌వో దిలీప్ తెలిపారు. ఎస్సైసుష్మిత, సిబ్బంది ప్రభాకర్, షబ్బీరుద్దీన్, దారిసింగ్, సునీల్, నిసార్ తదితరులు పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం

ఎడపలి: మండల కేంద్రానికి చెందిన వివాహిత బుధవారం అదృశ్యమైనట్లు ఎడపల్లి ఎస్సై వంశీకృష్ణ తెలిపారు. ఆమె భర్త గంగాదాస్ ఫిర్యాదుతో కేసు నమోదు చేశామన్నారు.

నిందితుడి రిమాండ్

బోధన్ గ్రామీణం, న్యూస్‌టుడే: ఆచన్‌పల్లి ప్రధాన రహదారిలోని ఓ సూపర్‌మార్కెట్‌లో దొంగతనం చేసిన ఘటనలో దెగ్లూర్‌కు చెందిన నిందితుడు వాగ్మారే సునీల్‌ను రిమాండ్‌కు తరలించినట్లు పట్టణ సీఐ వెంకటనారాయణ తెలిపారు. ఈ ఏడాది ఆగస్టులో తన బంధువు ఓం ప్రకాష్‌తో కలిసి మాల్‌లోకి చొరబడి రూ.10లక్షలకుపైగా నగదును దోచుకున్నారు. బుధవారం ఆచన్‌పల్లి ప్రాంతంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న సునీల్‌ను పోలీసులు గుర్తించి అదుపులోకి తీసుకొని విచారించగా దొంగతనానికి తాను సహకరించినట్లు ఒప్పుకొన్నాడు. అతని వద్ద ఉన్న రూ.90వేల నగదును స్వాధీనం చేసుకోగా ఓంప్రకాష్ పరారీలో ఉన్నాడని అతని కోసం గాలిస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

చలో నాగర్‌కర్నూల్

రుద్రూర్, న్యూస్‌టుడే: ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నాగర్‌కర్నూల్ పి.వి.రావు సభా ప్రాంగణం ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల గ్రౌండ్‌లో ఈ నెల 27న నిర్వహించే మాలల ఆత్మ గౌరవ సభకు మాలలు అధిక సంఖ్యలో తరలి రావాలని మండల సంఘం సభ్యులు పిలుపునిచ్చారు. రుద్రూర్‌లో బుధవారం గోడప్రతులను ఆవిష్కరించారు. నవీన్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

కార్యదర్శి సెలవులు.. నిలిచిన సేవలు

మోపాల్, న్యూస్‌టుడే: మండలంలోని మంచిప్ప పంచాయతీ కార్యదర్శి శ్యామ్ కుమార్ సెలవులో వెళ్లగా ఆయన బాధ్యతలను మరొకరికి ఇవ్వకపోవడంతో ప్రజలకు సేవలు అందడం లేదు. ఆయన ఈ నెల 17 నుంచి దీర్ఘకాలిక సెలవులో ఉన్నారు. ముదక్‌పల్లి, కులాస్‌పూర్ తండా కార్యదర్శులు సెలవుల్లో వెళ్లిన సమయంలో సమీప గ్రామాలైన చిన్నాపూర్, బైరాపూర్ కార్యదర్శులకు అదనపు బాధ్యతలు అప్పగించారు. కానీ మంచిప్ప బాధ్యతలు ఎవరికీ ఇవ్వకపోవడంతో జనన, మరణ, ఇంటి నిర్మాణ అనుమతులు, ఆధార్‌కార్డులో అడ్రస్ మార్పులకు ధ్రువీకరణ తదితర సేవలు నిలిచిపోయి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై ఎంపీడీవో రాములు మాట్లాడుతూ.. త్వరలో మరొకరికి బాధ్యతలు ఇవ్వనున్నట్లు చెప్పారు.

ఆర్మూర్

• ఆర్మూర్ • బాల్కొండ



హోటళ్లలో తనిఖీలు

ఆర్మూర్ పట్టణం, న్యూస్‌టుడే: ఆర్మూర్‌లోని పలు హోటళ్లలో బుధవారం బల్దియా అధికారులు తనిఖీలు చేపట్టారు. ప్లాస్టిక్ నిల్వలను స్వాధీనం చేసుకొన్నారు. పలువురు యజమానులకు జరిమానా విధించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ గజానంద్, పర్యావరణ ఇంజినీరు పూర్ణమౌళి, సిబ్బంది అర్జున్, అక్షయ్, రాము, నర్సయ్య, సంతోష్ పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

జక్రాన్‌పల్లి, న్యూస్‌టుడే: జక్రాన్‌పల్లి ఆదర్శ పాఠశాల, కళాశాలలో ఈ విద్యాసంవత్సరానికి తాత్కాలిక గంటల ప్రతిపాదికన బోధించుటకు వృక్ష శాస్త్రం, రసాయనశాస్త్రం అధ్యాపకులు కావాలని ప్రిన్సిపల్ సుధారాణి ఒక ప్రకటనలో తెలిపారు. పీజీ, బీఎడ్ పూర్తిచేసిన అభ్యర్థులు ఈ నెల 25వ తేదీలోపు కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

పీసీసీ అధ్యక్షుడిని కలిసిన అంజమ్మ

కమ్మర్‌పల్లి,న్యూస్‌టుడే: హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్‌ను కమ్మర్‌పల్లి మాజీ ఎంపీపీ, కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు అంజమ్మ బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సన్మానించారు.

పీవీఆర్ మల్టీప్లెక్స్ (ఆర్మూర్) ఈనాడు సినిమాలు

స్క్రీన్-1 జిగ్రా: 11.30, 5.40
మా నాన్న సూపర్ హీరో: 2.50 మార్టిన్: 9.00
స్క్రీన్-2 దేవర: 11.15, 2.50, 6.25, 10.00
స్క్రీన్-3 వేట్టయాన్ ది హంటర్ 11.50, 3.20, 6.50, 10.20
స్క్రీన్-4 విశ్వం: 10.00, 4.15, 10.30
జనక అయితే గనక: 1.15. 7.30

న్యూస్‌టుడే, ఆర్మూర్ పట్టణం

మేమున్నాం.. మీకు తోడుగా..

94939 26837
98666 11160

భీమ్‌గల్ గ్రామీణం, న్యూస్‌టుడే: పల్లికొండ బైపాస్ రోడ్డు పక్కన డ్రైనేజీ పూర్తిగా ముసుకుపోయింది. నీరు నిలిచింది. దోమల బెడద ఎక్కువైంది. వెంటనే శుభ్రం చేయించండి. **-స్థానికులు**

సమాధానం: సిబ్బందిని వెంటనే పంపి పూడిక తీయిస్తాం. దోమల నివారణ మందు పిచికారీ చేయిస్తాం.

-రాంమోహన్, పంచాయతీ కార్యదర్శి

ఎర్రజొన్న సాగు.. ఒప్పందాలు షురూ!





☛ క్వింటా సగటు ధర రూ. 3200

న్యూస్‌టుడే, ఆర్మూర్

యాసంగి సాగుకు సన్నద్ధమవుతున్న రైతులు ఎర్రజొన్నకు దుక్కులు సిద్ధం చేస్తున్నారు. మరో వైపు ప్రైవేటు కంపెనీలతో పంట కొనుగోలుకు ఒప్పందాలు మొదలు పెట్టారు. ప్రస్తుతం క్వింటాలుకు రూ. 3 వేల నుంచి రూ. 3,500 వరకు కొనేందుకు వ్యాపారులు ముందుకొస్తున్నారు. మరికొన్ని చోట్ల అప్పటి మార్కెట్ పరిస్థితిని బట్టి తిరిగి తీసుకుంటామని చెప్పి విత్తనాలిస్తున్నారు. గతేడాది అనుభవాలతో పంటకు మంచి గిట్టుబాటు ధర ఉన్న నేపథ్యంలో ఈ సారి ఎర్రజొన్న సాగు ఆశాజనకంగానే ఉంటుందని అంచనా వేస్తున్నారు.

25 వేల ఎకరాలు దాటే అవకాశం

ఆర్మూర్ డివిజన్‌లోని నందిపేట్, డొంకేశ్వర్, ఆలూర్, మాక్లూర్, ఆర్మూర్, బాల్కొండ, ఏర్గట్ల, మెండోరా, జక్రాన్‌పల్లి, మోర్తాడ్, ముప్కాల్, కమ్మర్‌పల్లి, వేల్పూర్, భీమ్‌గల్ మండలాల్లో విత్తన జొన్న సాగు ఎక్కువగా ఉంటుంది. గతేడాది 22 వేల ఎకరాల వరకు వేసిన ఈ పంట ఈ సారి పాతిక వేలకుపైగా వేసే అవకాశాలు ఉన్నాయి.

మక్కల నుంచి గట్టి పోటీ

ఏటా వ్యాపారులు పంట కొనేటప్పుడు సిండికేట్‌గా మారడం, చెల్లింపుల్లో నిర్లక్ష్యం చేయడం సాధారణమైపోయింది. దీంతో కొందరు రైతులు మొక్కజొన్న పంటపై ఆసక్తి చూపుతున్నారు. బహిరంగ మార్కెట్‌లో మద్దతు ధర కంటే ఎక్కువగా డిమాండ్ ఉండడం ఒక కారణమైతే యాసంగిలో దిగుబడి సగటున 35-40 క్వింటాళ్ల వరకు వచ్చే అవకాశాలు ఉన్నాయి. దీంతో ప్రస్తుతమున్న ధర ప్రకారం చూస్తే విత్తన జొన్న కంటే ఎక్కువగానే గిట్టుబాటవుతుందనే భావన రైతుల్లో నెలకొంది.

వ్యాపారుల పల్లె బాట

వ్యాపారులు గ్రామాల సంఘాలతో కలిసి రైతులతో ఒప్పందాలు రాసుకుంటున్నారు. ఎర్రజొన్నకు క్వింటాలుకు సగటున రూ.3,200 ఉండగా తెల్లజొన్నకు ధర కాస్త తక్కువగా కట్టిస్తున్నారు. ఫౌండేషన్ విత్తనానికి క్వింటాకు సగటున రూ. 4,200 వరకు చెల్లించేందుకు ముందుకొచ్చారు. ఎకరాకు 17 క్వింటాళ్ల వరకు దిగుబడి గ్యారంటీగా చెప్పి విత్తనం ఇస్తున్నారు. అంతకు తక్కువగా దిగుబడి వస్తే నష్టాన్ని కట్టుకునేందుకు రైతులను ఒప్పిస్తున్నారు. గ్రామమంతా ఒకే విత్తనాన్ని వేసుకునేలా ఒప్పందాల్లో నిబంధనలు పొందుపరుస్తున్నారు. గతేడాది సాధారణ పంటకే క్వింటాలుకు రూ. 4,500 వరకు అమ్ముడైంది. ఈ సారి కూడా మార్కెట్ ధర బాగుంటే రాబడికి ఢోకా లేదని అన్నదాతలు భావిస్తున్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

విత్తనోత్పత్తి చేసే రైతులు ముందుగానే ఆయా కంపెనీలతో ఒప్పందాలు చేసుకోవాలి. దిగుబడి ఎంత వస్తుంది? క్వింటాలుకు ధర ఎంత మేర కట్టిస్తారు? ఎప్పుడు డబ్బులిస్తారనే విషయాలు తప్పనిసరిగా రాసుకున్న తర్వాతనే సాగు మొదలుపెట్టాలి. భవిష్యత్తులో ఇబ్బందులు లేకుండా వ్యవహరించాలని ప్రైవేటు కంపెనీలకు, వ్యాపారులకు ఈ పాటికే అవగాహన కల్పించాం. నిబంధనలు ఉల్లంఘించే వారిపై చర్యలుంటాయని హెచ్చరించాం.

- వాజిద్‌హుస్సేన్, జిల్లా వ్యవసాయాధికారి

మెరుగైన వైద్య సేవలు అందించాలి



వివరాలు అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

ఆర్మూర్ గ్రామీణం, న్యూస్‌టుడే: సీజనల్ వ్యాధులు తగ్గుముఖం పట్టినప్పటికీ వైద్యులు, సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు పేర్కొన్నారు. ఆలూర్ మండలం దేగాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారిణి డాక్టర్ రాజశ్రీతో కలిసి కలెక్టర్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ల్యాబ్‌లో రక్త పరీక్షల తీరు గమనించి, టెక్నీషియన్‌తో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. వ్యాధి నిర్ధారణ కోసం స్థానికంగానే యంత్రాలను వినియోగిస్తున్నట్లు గుర్తించి సంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో పరీక్షలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌వోను ఆదేశించారు. ర్యాపిడ్ పరీక్ష కిట్లు అందుబాటులో ఉన్నాయా? అని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. వ్యాక్సిన్లు భద్రపర్చిన గదికి వెళ్లి. ఔషధాలు శీతలీకరణలో ఉంచేందుకు ఫ్రిడ్జ్‌లు ఉపయోగిస్తున్నారా లేనిది పరిశీలించారు. ఆరోగ్య కేంద్రం ఆవరణలో పిచ్చి మొక్కలు, గడ్డి ఉండటంతో అసహనం వ్యక్తం చేశారు. పరిసరాలు శుభ్రం చేయించాలని ఆదేశించారు.



చేంగల్‌లో.



మాక్లూర్‌లో..

కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

భీమ్‌గల్ గ్రామీణం, న్యూస్‌టుడే: బడాభీమ్‌గల్, చేంగల్, సికింద్రాపూర్, గొన్‌గొప్పుల గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం కమ్మర్‌పల్లి మార్కెట్ కమిటీ ఛైర్మన్ పాలెపు నర్సయ్య ప్రారంభించారు. డీపీఎం సాయిలు, ఏపీఎం రవీందర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు స్వామి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మహిపాల్, జీవన్, రమేష్, అనంతరావ్ పాల్గొన్నారు.

మాక్లూర్: మాక్లూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సహకార సంఘం ఛైర్మన్ బూరొల్ల అశోక్ బుధవారం ప్రారంభించారు. డైరెక్టర్లు జిట్ట గంగాధర్, కాశీనాథ్ రావు, కార్యదర్శి ప్రవీణ్, నాయకులు వెంకటేశ్వర్‌రావు, రాజేందర్, దత్తు, గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు ప్రసాద్, కోశాధికారి రవి పాల్గొన్నారు.

నియంత్రిక.. తొలగించాలిక



ఆర్మూర్ పట్టణంలోని బస్ డిపో సమీపంలో 40 ఫీట్ల రోడ్డుపై నియంత్రిక, జనరేటర్‌ను ఏర్పాటు చేశారు. ప్రైవేటు వ్యక్తులు ఇలా చేశారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై బుధవారం బల్దియా కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు

–న్యూస్‌టుడే, ఆర్మూర్ పట్టణం

పార్కింగ్ స్థలంగా పాత బస్టాండ్



ఆర్మూర్‌లోని పాత బస్టాండ్ ప్రైవేటు పార్కింగ్ స్థలంగా మారింది. నాడు నిత్యం బస్సులతో రద్దీగా ఉండే ప్రాంగణం శిథిలావస్థకు చేరుకొంది. కొత్త బస్టాండ్ అందుబాటులోకి రావడంతో అధికారులెవరూ పట్టించుకోవడం లేదు. ఇక్కడ కార్లు, ఆటోలు, ఇతర వాహనాలు నిలిపి ఉంచడంతో స్థానికంగా వ్యాపారాలు చేసుకొనే వారికి, నివాసం ఉండే వారికి ఇబ్బందులు తప్పడం లేదు. అధికారులు జోక్యం చేసుకొని వాహనాలు పార్కింగ్ చేయకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

–న్యూస్‌టుడే, ఆర్మూర్ పట్టణం

సైబర్ మోసాలపై అప్రమత్తత అవసరం



మాట్లాడుతున్న సైబర్ క్రైం డీఎస్పీ వెంకటేశ్వర్ రావు

ఆర్మూర్ పట్టణం, న్యూస్‌టుడే: ఆర్మూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం సైబర్ నేరాలు, భద్రతపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. నిజామాబాద్ సైబర్ క్రైం డీఎస్పీ వెంకటేశ్వర్ రావు పాల్గొని అవగాహన కల్పించారు. సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాల గురించి వివరించారు. వాటి బారిన పడకుండా ఉండటానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. సైబర్ నేరాల బారిన పడితే 1930 నంబరుకు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డా. వేణుప్రసాద్, ఆర్మూర్ సీఐ రవికుమార్, పీసీలు నాగభూషణం, అనిల్, వైస్ ప్రిన్సిపల్ డా.సునీత, జాన్ సుకుమార్, డా. అంబర్ సింగ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

నాణ్యమైన ఆహారంతోనే ఆరోగ్యం



పరిశీలిస్తున్న తహసీల్దార్ గజానన్, ఎంఈవో రాజగంగారాం, కమిషనర్ రాజు

ఆర్మూర్ పట్టణం, న్యూస్‌టుడే: ఆర్మూర్ పట్టణంలోని జడ్పీ బాలికల పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని బుధవారం తహసీల్దార్ గజానన్, ఎంఈవో రాజగంగారాం, బల్దియా కమిషనర్ రాజు కలిసి పరిశీలించారు. ఇటీవల అన్నంలో పురుగులు వస్తున్నాయని విద్యార్థినుల తల్లిదండ్రులు తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థినులు, వారి తల్లిదండ్రులు, ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయులు, మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులతో వేర్వేరుగా విచారణ జరిపారు. నివేదిక ఉన్నతాధికారులకు అందజేస్తామని తెలిపారు. నాణ్యమైన ఆహారాన్ని, పరిశుభ్రంగా వండి విద్యార్థినులకు అందజేయాలని సూచించారు. అప్పుడే ఆరోగ్యంగా ఉంటారని చెప్పారు.

రైతుల సమస్యలు పరిష్కరించాలి



మల్లారెడ్డిని సన్మానిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

ఆర్మూర్ గ్రామీణం, న్యూస్‌టుడే: ఆర్మూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా నియమితులైన ఆలూర్ మండల కేంద్రానికి చెందిన కళ్లెం మల్లారెడ్డిని బుధవారం జిల్లా కాంగ్రెస్ నాయకులు ఆలూర్ శ్రీనివాస్‌రెడ్డి ఘనంగా సన్మానించారు. ఆర్మూర్ ప్రాంత రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని, ఆర్మూర్ మార్కెట్ యార్డులో పంటల క్రయవిక్రయాలు ప్రారంభించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఉదయ్, గంగారెడ్డి, నర్సారెడ్డి, భోజన్న, నారాయణ, అనిల్, బీరయ్య, రాజారెడ్డి, నవీన్, మల్లయ్య,సుదర్శన్ పాల్గొన్నారు.

మంచినీటి సరఫరాలో ముఖ్యపాత్ర పోషించాలి

వేల్పూర్, న్యూస్‌టుడే : గ్రామాల్లో తాగునీటి సరఫరాలో ముఖ్యపాత్ర గ్రామ మంచినీటి సహాయకులు పోషించాలని వేల్పూర్, కమ్మర్‌పల్లి ఎంపీడీవోలు బాలకిషన్, రాజ శ్రీనివాసులు సూచించారు. నాలుగు రోజులుగా వారికి నిర్వహిస్తున్న శిక్షణ బుధవారం పూర్తి కావడంతో వారికి ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈఈ అమీర్ ఖాన్, ఎఈ అమీర్‌ఖాన్ పాల్గొన్నారు.



ధ్రువీకరణ పత్రాలతో సహాయకులు

కాంగ్రెస్ పాలనలో ప్రగతి పరుగులు

నిజామాబాద్ గ్రామీణం, న్యూస్‌టుడే: కాంగ్రెస్ పాలనతోనే రాష్ట్రం అభివృద్ధిలో పరుగులు తీస్తోందని నిజామాబాద్ గ్రామీణ ఎమ్మెల్యే భూపతిరెడ్డి పేర్కొన్నారు. గ్రామీణ మండలం కొత్తాపేట్‌లో బుధవారం సొసైటీ గోదాం ప్రారంభం, ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రం భవన నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ గత పదేళ్లలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేసిందేమీ లేదని విమర్శించారు. అన్ని వర్గాలను విస్మరించాయని మండిపడ్డారు. రైతుల అభ్యున్నతికి తమ సర్కారు కృషి చేస్తుందన్నారు. నియోజకవర్గంలో 3500 ఇందిరమ్మ ఇళ్లను పేదవారికి అందిస్తామని తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు సకల సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ఛైర్మన్ ముప్ప గంగారెడ్డి, శేఖర్‌గౌడ్, ఎల్లయ్య, సురేష్, హరిచంద్, కుమార్‌రెడ్డి, స్వామి, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌వోసీ మంజూరు



భీమ్‌గల్ గ్రామీణం, న్యూస్‌టుడే: బడాభీమ్‌గల్ గ్రామానికి చెందిన ఎల్. గంగామణి గుండె జబ్బుతో బాధపడుతూ హైదరాబాద్‌లోని నిమ్స్‌లో చికిత్స పొందుతున్నారు. వైద్య ఖర్చుల కోసం ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి దృష్టికి తీసుకురాగా ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ. 1,25,000 ఎల్‌వోసీ మంజూరు చేయించారు. బాధిత కుటుంబ సభ్యులకు బుధవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో అందజేశారు.

1 నుంచి అమర వీరుల వారోత్సవాలు

ఆర్మూర్ పట్టణం, న్యూస్‌టుడే: భూమి, భుక్తి, పీడిత ప్రజల విముక్తి కోసం ప్రాణాలు అర్పించిన అమర వీరుల వారోత్సవాలు నవంబరు 1 నుంచి 30 వరకు నిర్వహించాలని సీపీఐ(ఎంఎల్) కేంద్ర కార్యదర్శి ప్రభాకర్ పిలుపుమేరకు బుధవారం ఆర్మూర్‌లో కరపత్రాలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ శ్రామిక స్పందన రాష్ట్ర అధ్యక్షుడు సుధాకర్, రైతు కూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చిట్టిబాబు, పద్మ, పెద్దులు, సంజీవ్ పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

బస్సు కోసం సంతకాల సేకరణ

నిజామాబాద్ విద్యావిభాగం, న్యూస్‌టుడే: గిరిరాజ్ ప్రభుత్వ కళాశాల సమయానికి అనుకూలంగా నగరంలోని పలు ప్రాంతాల నుంచి మూడు వేళల్లో ఆర్టీసీ బస్సులు నడపాలని కోరుతూ బుధవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. గతేడాది కళాశాల వరకు బస్సు సదుపాయం ఉండేదని, నూతన ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. సంఘ కళాశాల యూనిట్ కార్యదర్శి చక్రి, సభ్యులు దినేష్, సుజిత్ తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనం చెల్లించాలని డిమాండు

నిజామాబాద్ నగరం, న్యూస్‌టుడే: మున్సిపల్ ఔట్ సోర్సింగ్ కార్మికులకు కనీస వేతనం రూ. 26 వేలు చెల్లించాలని బహుజన మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయీస్ యూనియన్(బీఎల్‌టీయూ) రాష్ట్ర అధ్యక్షుడు దండి వెంకట్ డిమాండ్ చేశారు. నగరపాలక సంస్థ ఎదుట బుధవారం ధర్నా నిర్వహించి మాట్లాడారు. మృతిచెందిన కార్మికుడి కుటుంబానికి రూ. 50 లక్షలు చెల్లించాలని, బీమా సౌకర్యం కల్పించాలని కోరారు.

గ్రంథాలయ సంస్థ ఛైర్మన్‌కు సన్మానం



నందిపేట్, న్యూస్‌టుడే: జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డిని నందిపేట్ మండల కాంగ్రెస్ నాయకులు సన్మానించారు. బుధవారం పార్టీ మండల అధ్యక్షుడు మంద మహిపాల్, వివిధ గ్రామాల నాయకులు జిల్లా కేంద్రంలో ఆయనను కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి శాలువాతో సన్మానించారు. నందిపేట్‌లో గ్రంథాలయ భవనాన్ని ఏర్పాటు చేయడానికి కృషి చేయాలన్నారు.

అవీ...ఇవీ.. అన్నీ

ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న బస్సు



భీమ్‌గల్ గ్రామీణం, న్యూస్‌టుడే: బడాభీమ్‌గల్ శివారులో బుధవారం ద్విచక్రవాహనాన్ని ప్రైవేట్ స్కూల్ బస్సు ఢీకొంది. ఈ ఘటనలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ఏర్గట్ల: ఏర్గట్లకు చెందిన ఎస్కే మోషి కుమారుడు రిజ్వాన్ కొంతకాలంగా గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ బాల్కొండ నియోజకవర్గ ఇన్‌ఛార్జి ముత్యాల సునీల్ రెడ్డి తన అనుచరుల ద్వారా రూ. 10వేలు బాధిత కుటుంబీకులకు బుధవారం అందజేశారు.

ఏర్గట్ల కేజీబీవీ సందర్శన

ఏర్గట్ల: మండల విద్యాధికారి ఆనంద్‌రావు మండల కేంద్రంలోని కేజీబీవీని బుధవారం తనిఖీ చేశారు. పాఠశాలలో జరుగుతున్న ఎస్ఏ-1 పరీక్షలు పరిశీలించారు. వంటశాలను సందర్శించి, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని సూచించారు. అనంతరం దస్త్రాలు పరిశీలించారు. పాఠశాల ప్రత్యేకాధికారిణి సంధ్య, సిబ్బంది ఉన్నారు.

తొర్తిలో పోస్టల్ మేళా

తొర్తి(ఏర్గట్ల): తొర్తి గ్రామ పంచాయతీ కార్యాలయంలో బుధవారం పోస్టల్ కార్డుల కేవైసీ అప్‌డేట్‌లకు సంబంధించిన మేళా బుధవారం నిర్వహించారు. ఐపీపీబీ ఖాతాకు ఆధార్ కార్డు అనుసంధానించడంతో గ్యాస్, ఉపాధి హామీ, పీఎం కిసాన్ వంటి డబ్బులు ఖాతాలో జమ అవుతాయి.

ఉపాధి పనుల పరిశీలన



దొంచంద(ఏర్గట్ల): ఉపాధి హామీ పనుల గుర్తింపుపై దొంచంద గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఎంపీడీవో వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో బుధవారం గ్రామ సభ నిర్వహించారు. అనంతరం పంచాయతీ కార్యాలయంలోని దస్త్రాలు పరిశీలించారు. గ్రామంలో జరిగిన ఉపాధి హామీ పనులు పరిశీలించారు. ఆయన వెంట ఏపీవో వెంకటేశ్, టీఏలు, ఎఫ్ఏలు, ఇన్‌ఛార్జి కార్యదర్శి సంధ్య ఉన్నారు.

మోర్తాడ్‌లో చోరీ

మోర్తాడ్, న్యూస్‌టుడే: మోర్తాడ్‌లో తాళం వేసిన ఇంటిని దొంగలు ఖాళీ చేశారు. ఎస్సై విక్రమ్ తెలిపిన వివరాల ప్రకారం.. మోర్తాడ్‌కు చెందిన అరటి వినయ్ ఇంట్లోకి దొంగలు చొరబడి 2 తులాల బంగారం, 10 తులాల వెండిని అపహరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై విక్రమ్ తెలిపారు.

అధ్యాపకుడికి డాక్టరేట్

మోర్తాడ్, న్యూస్‌టుడే: మోర్తాడ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాజనీతిశాస్త్రం అధ్యాపకుడు రవీందర్‌కు డాక్టరేట్ వచ్చినట్లు ప్రిన్సిపల్ పెద్దన్న తెలిపారు. స్టడీ అండ్ కాలేజ్ స్టూడెంట్ పొలిటికల్ యాక్టివిటీ అండ్ ఆన్‌లైన్ సోషల్ మీడియా అనే అంశంలో చేసిన పరిశోధనకు రాజస్థాన్‌లోని సన్‌రైజ్ విశ్వవిద్యాలయం డాక్టరేట్ ఇచ్చిందని వెల్లడించారు. రవీందర్‌ను కళాశాల సిబ్బంది సన్మానించారు.



రవీందర్‌ను సన్మానిస్తున్న ప్రిన్సిపల్ పెద్దన్న

పశువులకు టీకాలు

దూద్‌గాం(బాల్కొండ): మెండోరా మండలం దూద్‌గాంలో పశువైద్య శిబిరం బుధవారం నిర్వహించారు. 250 పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేశారు. పశువైద్యాధికారి గౌతమ్‌రాజ్, సిబ్బంది ప్రణీత్, మల్లేష్ పాల్గొన్నారు.

కుక్కల పట్టివేత

ఆర్మూర్ పట్టణం, న్యూస్‌టుడే: ఆర్మూర్ పట్టణ పరిధిలోని శునకాలకు కు.ని ప్రక్రియ కొనసాగుతోంది. బుధవారం రెండో వార్డులో సిబ్బంది వాటిని పట్టి తరలించారు. కోతులు, పందుల విషయంలోనూ పుర అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానిక కౌన్సిలర్ ఖాందేశ్ సంగీత కోరారు.

మాజీ ఉప సర్పంచి మృతి

ఆర్మూర్ గ్రామీణం: పెర్కిట్ గ్రామ మాజీ ఉప సర్పంచి పసుపుల రవి(51) బుధవారం అనారోగ్యంతో మృతి చెందారు. జిల్లా దేవాంగ సంఘం, కొటార్మూర్ గ్రామాభివృద్ధి కమిటీ, కొటార్మూర్ దేవాంగ సంఘం అధ్యక్షుడిగా ఆయన సేవలు అందించారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.